నేటి నిజం

website2:www.netinijam.com

హైదరాబాద్ ఆదివారం 3-12-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:98 పేజీలు:6 వెల: రూ.1/-

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్

హైదరాబాద్, డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. ఎగ్జిట్ పోల్స్‌లో కూడా స్పష్టత రాకపోవడంతో ఈ ఫీవర్ ఏపీ, కర్ణాటకకు సైతం తాకింది. దీంతో బెట్టింగ్ జోరందుకున్నది. నియోజకవర్గాలు, అభ్యర్థుల వారీగా భారీగా పందేలు కాస్తున్నట్టు తెలుస్తున్నది. చాలామంది బీఆర్ఎస్ గెలుపు, కేసీఆర్ వ్యూహరచనపై నమ్మకం పెట్టుకున్నట్టు సమాచారం. ఒక్కో బెట్టింగ్ రూ.10 లక్షలు మొదలుకొని కోటికి పైగా నడుస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యంగా ఏపీకి చెందిన కొందరు పందెం రాయుళ్లు భారీస్థాయిలో బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు నిఘా వర్గాల ద్వారా తెలిసింది. అటు ఏపీతో పాటు ఇటు తెలంగాణలో సైతం బెట్టింగ్ ఊపందుకున్నది. నియోజకవర్గ అభ్యర్థిపై బెట్టింగ్‌తో పాటు కచ్చితంగా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని బెట్టింగ్‌లకు దిగుతున్నారు. ఎంఐఎం, బీఆర్ఎస్ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయనే అంశంపై జోరుగా బెట్టింగ్‌లు నడుస్తున్నట్టు సమాచారం. పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

హైదరాబాద్, డిసెంబర్ 2:తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఉత్కంఠ ఆదివారం వీడనుంది. నెల రోజులపాటు విస్తృత ప్రచారం చేసిన నాయకుల భవితవ్యం రేపు బయటపడనుంది.. ఆదివారం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలవనుంది.. ఇందుకోసం ఎలక్షన్ కమిషన్ అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠగా మారిన క్రమంలో అధికార బీఆర్ఎస్ మళ్లీ అధికారాన్ని దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్‌తో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్.. ఎగ్జామ్ పోల్స్ తమకు శుభవార్తను అందిస్తాయని ఆశ భావం వ్యక్తంచేస్తోంది.

ప్రతి నియోజకవర్గంలో మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించిన అనంతరం అరగంట తర్వాత ఈవీఎంలలో ఉన్న ఓట్లను లెక్కిస్తారు. ఇక హైదరాబాదులో 15 నియోజకవర్గాలకు గాను కౌంటింగ్ సెంటర్స్ ను ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గంలో లెక్కింపు కోసం 14 చొప్పున టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ కోసం అదనంగా మరో టేబుల్ ను ఏర్పాటు చేస్తారు. మొత్తం ఈవీఎంల లెక్కింపు కోసం 1766 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ కోసం 131 టేబుళ్లు, ఉంటాయి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువగా ఉంటే పోస్టల్ బ్యాలెట్ ఈవీఎం లెక్కింపు సమాంతరంగా కొనసాగుతుంది. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ సహా రాష్ట్రంలోని కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల సమీపంలో ఎలాంటి ఊరేగింపులు చేయవద్దని ఇప్పటికే పార్టీ కార్యకర్తలకు నాయకులకు సూచించారు.

ఓట్ల లెక్కింపు ఎలా?

ఓట్ల లెక్కింపు నుంచి ఎన్నికల ఫలితాల వెల్లడి వరకు బాధ్యత అంతా రిటర్నింగ్ అధికారి పైనే ఉంటుంది పార్టీ అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు ఎలక్షన్ ఏజెంట్లను లెక్కింపు కేంద్రంలోకి అనుమతిస్తారు రిటర్నింగ్ అధికారి. ఒక్కో కౌంటింగ్ కేంద్రంలో 14 మందిని ఉంచకుండా కౌంటింగ్ ఏజెంట్లను అనుమతిస్తారు. ఈవీఎంలు ట్యాంపర్ కాలేదని దాని సీల్ సక్రమంగా ఉందని లెక్కింపు సిబ్బంది కౌంటింగ్ ఏజెంట్లు నిర్ధారించుకుంటారు. ఒకవేళ ఈవీఎంలు సక్రమంగా లేవని భావిస్తే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ప్రతి కౌంటింగ్ టేబుల్ మీద బ్లూ పాయింట్ పెన్ ఫారం 17 సి లోని పార్ట్ 2 పేపర్ ఉంచాలి. కౌంటింగ్ కు ముందు 17 సి ఫారం ఆధారంగా పోలైన ఓట్లు ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లు సమానంగా ఉన్నాయో లేదో సరి చూసుకుంటారు. వాటిని నోట్ చేసుకోవడంతో పాటు వివిధ పార్టీల ఏజెంట్లకు కూడా చూపించి వారి సంతకాలు తీసుకుంటా రు. ఆ తర్వాత ఈవీఎంల సీన్లు తొలగించి రిజల్ట్ బటన్ నొక్కుతారు. అప్పుడు ఒక్కో అభ్యర్థికి ఆ ఈవీయంలో ఎన్ని ఓట్లు వచ్చాయో తెలుస్తోంది. ఆ గణాంకా లను నోట్ చేసుకుంటారు.

ఒక్కో రౌండ్ లో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోర్డుపై రాసి ప్రకటిస్తారు. ఇలా ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద సూపర్వైజర్, అసిస్టెంట్ సూపర్?వైజర్, మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. ఈ లెక్కింపు ప్రక్రియ అంతా పార్టీల ప్రతినిధులు ఏజెంట్ల సమక్షంలోనే కొనసాగుతోంది. రౌండ్ ఫలితాన్ని వారు సంతృప్తి చెందిన తర్వాతే వెల్లడిస్తారు. ఎన్నికల సంఘం పరిశీలికుడు మాత్రమే కౌంటింగ్ కేంద్రం లోపల ఫోన్ వినియోగించుకోవడానికి అర్హులు.. మిగిలిన వారు ఫోన్ తీసుకెళ్లడానికి అనుమతి లేదు. ఇలా ఎన్నికల లెక్కింపును వీడియో తీసి వాటిని సీడీలలో భద్రపరుస్తారు. ఈ విధంగా భారీ భద్రత నడుమ కౌంటింగ్ కొనసాగనుంది.

గాజాపై విరుచుకుపడిన ఇజ్రాయెల్.. 178 మంది పాలస్తీనా ప్రజల మృతి

గాజా డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: హమాస్‌తో ఏడు రోజుల కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన వెంటనే గాజాపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. హమాస్‌ను తుదముట్టించేంత వరకు యుద్ధాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆపేది లేదన్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమెన్ నెతన్యాహూ మాటలను నిజంచేస్తూ.. ఆ దేశ సైన్యం గాజా స్ట్రిప్‌పై బాంబుల వర్షం కురించింది. దీంతో కాల్పుల విరమణ ముగిసిన తర్వాత ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు 178 మంది పాలస్తీనా ప్రజలు మరణించినట్లు గాజా ఆరోగ్యశాఖ ప్రకటించింది. పెద్ద సంఖ్యలో పౌరులు గాయపడినట్లు తెలిపింది. ఈ దాడులతో గాజాలో మళ్లీ ఆసుపత్రుల్లో దారుణ పరిస్థితులు ఏర్పడుతాయని ఐక్యరాజ్య సమితికి చెందిన పలు సంస్థలు హెచ్చరికలు జారీ చేశాయి.ఇజ్రా యెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అక్టోబర్ 24న జరిగింది. మొదట నాలుగు రోజులే ఒప్పందం చేసుకున్న ప్పటికీ, తర్వాత బందీల విడుదల కోసం మరో మూడు రోజులు పెం చారు. దీంతో ఇరువైపుల నుంచి దా డులు జరగలేదు. ఈ ఏడు రోజుల్లో గాజాకు మానవాతా సాయం అందడంతోపాటు ఇరుపక్షాల మధ్య బందీల విడుదల జరిగింది. అయితే గడువు శుక్రవారం ఉదయంతో ముగియడంతో కాల్పుల విరమణను ఇంకొన్నిరోజులపాటు కొనసాగించాలని అంతర్జాతీయ సమాజం నుంచి ఒత్తిడి వచ్చినప్పటికీ కాల్పులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో గాజాలో మరోసారి మారణహోహం కొనసాగుతున్నది.

ఇద్దరు మావోయిస్టు పార్టీ సాంకేతిక నిపుణుల అరెస్ట్

రామగుండం, డిసెంబర్ 2: మావోయిస్టు పార్టీలో సాంకేతిక నిపుణులుగా పనిచేస్తున్న ఇద్దరు మావోయిస్టు సభ్యులను రామగుండం పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ రెమో రాజేశ్వరి మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

పోలీసులకు అందిన సమాచారం మేరకు మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందారం గ్రామంలో ఓ ఇంట్లో ఇద్దరు మావోయిస్టు సభ్యులున్నారన్న సమాచారం మేరకు ఆ ఇంటిని తనిఖీ చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని ఆమె పేర్కొన్నారు. సీపీఐ మావోయిస్టు పార్టీ సెంట్రల్ టెక్నికల్ టీం క్యాడర్ గంగాధర రావుఅలియాస్ నర్సన్న , అతడి భార్య భవానీ అలియాస్ సుజాత అలియాస్ శ్యామలను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన గంగాధర రావు, మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన భవానిని అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి రూ. 1. 57,900 , రెండు మొబైల్ ఫోన్లు, ఆధార్, పాన్‌కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రెండు పెన్ డ్రైవ్‌లు, తెలంగాణ రెండవ ప్లీనరీ తీర్మానాల ప్రతులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మొక్కల సహజీవనంతోనే మానవ మనుగడ

– మొక్కలు నాటిన ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్

హైదరాబాద్ డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కాలుష్యాల కారణంగా

మానవ జీవితం ప్రమాదంలో పడిందని, కాలుష్య నియంత్రణ సాధ్యం కాకపోతే భవిష్యత్ ప్రమాదంలో పడనుందని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య పేర్కొన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని (డిసెంబర్ -2) పురస్కరించుకొని "ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్'' ఆధ్వర్యంలో హైదరాబాద్ అర్బన్ బయోడైవర్సిటీ సహకారంతో 'హైదరాబాద్ ఫివర్ ఆసుపత్రిలో' మొక్కలు నాటారు. ఆసుపత్రి ఆర్ ఎం ఓ జయలక్ష్మి, పర్యావరణ వాది జ్యోతి రెడ్డి, కౌన్సిల్ అధ్యక్షులు రంగయ్య తదితరులు మొక్కలు నాటి అనంతరం మాట్లాడారు. ఇవాళ ఢిల్లీ లాంటి ప్రాంతాల్లో కాలుష్యం కోరలు చాచి జనజీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోరలు చాస్తున్న కాలుష్య నియంత్రణ కోసం విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. అంతేగాక కాలుష్యరహిత జీవనానికి అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమిష్టిగా కాలుష్య నియంత్రణ చేయకపోతే భావితరాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదముందన్నారు. అందుకు ఎన్విరాన్మెంట్ కౌన్సిల్ లాంటి సంస్థలు, వ్యక్తులు చేతులు కలపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు పర్యావరణ కార్యకర్తలు, పర్యావరణ వాదులు పాల్గొన్నారు.

4 నుంచి 22 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

–ఏడు బిల్లులను ప్రవేశపెట్టాలని యోచిస్తున్న కేంద్రం

న్యూ డిల్లీ డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఈ నెల 4 నుంచి 22 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగనున్నాయి. ఈ సమావేశాల్లో ఏడు బిల్లులను ప్రవేశపెట్టాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. బిల్లుల్లో జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు-2023, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు, జాతీయ రాజధాని ప్రాంతం ఢిల్లీ చట్టాలు (ప్రత్యేక నిబంధనలు) రెండవ (సవరణ) బిల్లుతో పాటు మరికొన్ని బిల్లులు ఉన్నట్లు తెలుస్తున్నది. జమ్మూ కాశ్మీర్, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లతో సెషన్స్‌లోనే ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టే ఛాన్స్ ఉంది.నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ లాస్ (ప్రత్యేక నిబంధనలు) రెండో (సవరణ) బిల్లును సైతం ప్రవేశపెట్టనున్నది. చట్టం చెల్లుబాటును 2026 డిసెంబర్ 31 వరకు పొడిగించాలని కోరింది. తాతాల్కిక పన్నుల సేకరణ బిల్లు-2023, కేంద్ర వస్తువులు-సేవల పన్నులు (రెండో సవరణ) బిల్లు, సెంట్రల్ యూనివర్సిటీ (సవరణ) బిల్లు, తెలంగాణలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, బాయిలర్స్ బిల్లు సైతం పార్లమెంట్ ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తున్నది. వీటితో పాటు ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌లను ఆమోదం కోసం పార్లమెంట్ ముందుకు తీసుకు వచ్చే ఛాన్స్ కనిపిస్తుంది.ప్రస్తుతం పెండింగ్‌లో 37 బిల్లు ఉండగా.. 12 వరకు చర్చించనున్నట్లు సమాచారం. ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లుపై చర్చించనున్నట్లు తెలుస్తున్నది. అయితే, ఈ బిల్లులోని కొన్ని నిబంధనలను ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా 'కఠోరమైంది'గా పేర్కొంది. ఆగస్టులో వర్షాకాల సమావేశాల సందర్భంగా రాజ్యసభలో ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటుతో ఆమోదించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్‌ల నియామకం.. వేతనం, తొలగింపుపై కేంద్రానికి నియంత్రణను ఇచ్చే ప్రధాన ఎన్నికల కమిషనర్ మరియు ఇతర ఎన్నికల కమిషనర్‌ల (నియామకం, సేవా నిబంధనలు మరియు పదవీకాలం) బిల్లుపై సైతం పార్లమెంట్‌లో చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

బంగ్లాదేశ్‌ను వణికించిన భారీ భూకంపం.. పశ్చిమబెంగాల్‌లోనూ ప్రకంపనలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:బంగ్లాదేశ్ లో శనివారం ఉదయం 5.6 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. చిట్టగాంగ్‌లో భూ అంతర్భాగంలో 55 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ వెల్లడించింది. ఈ భూకంపం కారణంగా పొరుగున ఉన్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోనూ భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి.

బెంగాల్‌లోని కోల్‌కతా సహా పలు ప్రాంతాల్లో భూమి ఒక్కసారిగా కంపించింది. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, ఈ ప్రకంపనల కారణంగా రాష్ట్రంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని పశ్చిమ బెంగాల్ విపత్తు నిర్వహణ శాఖ తెలిపింది. 'ఇప్పటి వరకూ అందిన సమాచారం మేరకు.. భూకంపం కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లలేదు' అని అధికారులు తెలిపారు. కోల్‌కతా పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది.

కాగా, శనివారం ఉదయం 9.41 గంటలకు చిట్టగాంగ్‌లోని రామ్‌గంజ్‌లో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.6గా నమోదయిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. భూ అంతర్భాగంలో 55 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయని వెల్లడించింది. రామ్‌గంజ్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నదని తెలిపింది. నిమిషాల వ్యవధిలో చిట్టగాంగ్ ప్రావిన్స్‌లోని లక్ష్మీపూర్, చాంద్‌పూర్, కొమిల్లాలో భూమి కంపించిందని పేర్కొంది. అదేవిధంగా రాజ్‌షాహి, సిల్హెట్, ఢాకా , నొవాఖలి, కుష్టియాలో కూడా ప్రకంపణలు చోటుచేసుకున్నాయని చెప్పింది. భూకంపం వల్ల జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదని అధికారులు చెప్పారు

ఇష్టానుసారం వ్యవహరిస్తే రాష్ట్రాల మధ్య సంబంధాలకు దెబ్బ: గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్లగొండ, డిసెంబర్ 2: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దుస్సాహం చేసిందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టుపై దండయాత్ర చేసి 13 గేట్లను అక్రమించడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఇది చాలా తీవ్రమైన అంశమని, దురాలోచనతోనే ఏపీ ప్రభుత్వం ఈ దుశ్చర్యకు పాల్పడిందని విమర్శించారు. ఇష్టానుసారం వ్యవహరిస్తే రాష్ట్రాల మధ్య సంబంధాలు దెబ్బతింటాయన్నారు. నల్లగొండలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ పర్యవేక్షణలో శ్రీశైలం, తెలంగాణ ప్రభుత్వ పర్యవేక్షణలో నాగార్జున సాగర్ ఉండాలన్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా సాగర్‌ను దురాక్రమించడం సరికాదని హితవు పలికారు. ఏపీ ప్రభుత్వ విధానం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రెండు రాష్ట్రాల మధ్య సామరస్య వాతావరణానికి విఘాతం కలిగేలా ఉందని చెప్పారు. కుడి కాలువకు నీటి విడుదల ఆపాలని కృష్ణా రివర్ బోర్డ్ ఆదేశించిందన్నారు. అయినా నీటి విడుదల కొనసాగుతున్నదని, పోలీసులు వెనక్కి వెళ్లలేదని తెలిపారు. రాష్ట్రాల పరిధిలో వుండే హక్కులను కేంద్రం చేతుల్లోకి పోయేలా ఆంధ్ర ప్రభుత్వం కుట్ర చేసిందని విమర్శించారు.

రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం మూడోసారి అధికారంలో రానుందని చెప్పారు. తమకు పూర్తి విశ్వాసం ఉందని వెల్లడించారు. ఎగ్జిట్ పోల్స్ అన్నీ అబద్ధాలేనని స్పష్టం చేశారు. ఆదివారం జరుగనున్న ఎన్నికల కౌంటింగ్‌లో బీఆర్ఎస్ ప్రభంజనం కనబడుతుందన్నారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని, ఎగ్జిట్ పోల్స్ ఏవి నిజం కావని తెలిపారు.

ఓట్ల లెక్కింపుపై సీపీ, ఎస్‌పీలతో డీజీపీ అంజనీ కుమార్ సమీక్ష

హైదరాబాద్, డిసెంబర్ 2: ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డీజీపీ అంజనీ కుమార్ సూచించారు. సీపీలు, ఎస్‌పీలతో డీజీపీ శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తుపై సమీక్షించారు. లెక్కింపు కేంద్రాల వెలుపల పటిష్ఠ నిఘా పెట్టాలని, కేంద్రాల లోపల సైతం దృష్టి సారించాలని అంజనీ కుమార్ సూచించారు. చివరి రౌండ్లలో ఉత్కంఠగా ఉండే అవకాశం ఉంటుందని, ఆ సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద ఎవరినీ గుమిగూడనివ్వొద్దని, పికెటింగ్ చేయడంతో పాటు అదనపు బలగాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని, ప్రతీకారదాడులు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోటీలో ఉన్న ప్రధాన పార్టీ అభ్యర్థులతో పోలీసు అధికారులు సమన్వయం చేసుకోవాలని, ఎవరు గెలుపొందిన పోలీసులకు సహకరించేలా వివరించాలని చెప్పారు. ఇప్పటి వరకు ఎలాంటి విఘాతం లేకుండా ఎన్నికల బందోబస్తు నిర్వహించామని, ఈ రెండు రోజులు మరింత అప్రమత్తంగా ఉండి, ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సీపీలు, ఎస్పీలను అంజనీ కుమార్ ఆదేశించారు.

బీసీ బిల్లు కోసం 13,14 తేదీల్లో పార్లమెంట్ ముట్టడి : ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, డిసెంబర్ 2:కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో శనివారం కాచిగూడలో నిర్వహించిన వివిధ రాష్ట్రాల బీసీ సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వేలాది మందితో ఈ నెల 13,14వ తేదీలలో 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని చేపట్టి పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. బీసీలకు రావాల్సిన రాజ్యాంగపరమైన హక్కులను కల్పించకుండా మోదీ ప్రభుత్వం అణిచివేస్తుందన్నారు.

బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, బీసీలంటే వాటాదారులని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న దాదాపు 16 లక్షల ఉద్యోగాలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో 54 శాతం బీసీలు ఉన్నారని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

తుఫాన్ ప్రభావంతో ఏపీలో విస్తారంగా కురవనున్నావర్షాలు

విశాఖపట్నం డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్;: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. తుఫాన్ వల్ల ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. రేపటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో, దక్షిణ కోస్తా రాయలసీమ జిల్లాలో పలుచోట్ల ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తీరం వెంబడి బలమైన గాలులు ఉంటాయని, మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని సూచించారు. తుఫాన్ ఈనెల 4వ తేదీన, నెల్లూరు మచిలీపట్నం, మధ్య దక్షిణ తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలిపారు. ఈ తుఫాన్ ప్రభావం కోస్తా జిల్లాల అన్నింటి పైనా ఉంటుందన్నారు. ప్రభావంతో తమిళనాడులో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. ఈ ప్రాంతాలకి ఆరెంజ్ వార్నింగ్ జారీ చేశామని తుఫాన్ హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద వెల్లడించారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ లో పాల్గొన్న కిడ్స్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణం లో ని కిడ్స్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు సిరిసిల్ల లోని జిల్లా పరిషత్ పాఠశాల లో నిర్వహించిన 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సైన్స్ సంబందించిన వివిధ ప్రాజెక్టులు ప్రదర్శించారు ఈ ప్రదర్శన లో కిడ్స్ కాన్వెంట్ స్కూల్ కి చెందిన ఎనిమిదవ తరగతి కి చెందిన వి.నిత్యశ్రీ కి జిల్లా స్థాయి లో ఏడవ బహుమతి లబించింది ఈవిద్యార్థికిమెమెంటో ,సర్టిఫికేట్ జిల్లా విద్య అధికారి చేతుల మీదుగా అందుకోవడం జరిగింది పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికేట్స్ అందించారు ఈ కార్యక్రమములో కిడ్స్ కాన్వెంట్ ప్రిన్సిపాల్ ధరక్షన్ వసుపియ, సైన్స్ టీచర్స్ , విద్యార్థులు పాల్గొన్నారు

నేటి కందం– నేటికీ అందం

భారతము మీద దుష్టులు
భారత్వముతోడ వేటు వేయగ జూడన్
శూరులగు భారతీయులు
వీరులుగా పోరినారు విజయము కొరకై ?

(3-12-1971 భారత్-పాక్ యుద్ధం)

–రాధశ్రీ
సెల్:9494481210

అబ్దుల్ కలాం ప్రశంసలు పొందిన తెలుగు తేజం బొల్లం శ్రీకాంత్

(03 డిసెంబర్ "అంతర్జాతీయ దివ్యాంగుల దినం" సందర్భంగా)

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం విశ్వవ్యాప్తంగా 100 కోట్లకు పైగా దివ్యాంగులు (ప్రపంచ జనాభాలో దాదాపు 15 శాతం) ఉన్నారని తెలుస్తున్నది. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడం, వారి ఆర్థిక/రాజకీయ/సాంస్కృతిక/సామాజిక శ్రేయస్సుకు కార్యాచరణ అమలు చేయడం, వారికి సహానుభూతిని ప్రకటించడం, అవసర చేయూతను స్వచ్ఛందంగా అందించడం లాంటి పలు అంశాలను చర్చించడానికి 1992 నుంచి ప్రపంచవ్యాప్తంగా 03 డిసెంబర్‌న "అంతర్జాతీయ దివ్యాంగుల దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ దివ్యాంగుల దినం-2023 నినాదంగా "ఐక్య కార్యాచరణతో దివ్యాంగుల సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచంలో అతి పెద్ద మైనారిటీ వర్గంగా అంగవైకల్యం కలిగిన వారు ఉన్నారు. అంగవైకల్యంతో బాధ పడుతున్న వ్యక్తుల్లో అనారోగ్యం, పేదరికం, అవిద్య లాంటి సమస్యలు సర్వసాధారణంగా కనిపిస్తాయి. దివ్యాంగులకు విద్య, వైద్య వసతులు కలిపించడం తక్షణావసరం అని భావించాలి.

అంధ ఔత్సాహిక పారిశ్రామిక వేత్త బొల్లం శ్రీకాంత్:

హైదరాబాదులో బొల్లంట్ పరిశ్రమలను స్థాపించిన దివ్యాంగుడు, ఔత్సాహిక పారిశ్రామికవేత్త బొల్లం శ్రీకాంత్ పుట్టుక నుంచే అంధత్వ చీకట్లను ఎదుర్కొన్నారు. 07 జూలై 1991న సీతారాంపురం, మచిలీపట్నంలోకి వ్యవసాయ కుటుంబంలో జన్మించిన శ్రీకాంత్ తన 6వ ఏటనే సమీప పాఠశాలకు 4-5 కిమీ కాలి నడకన వెళ్లి అక్షర యాత్ర ప్రారంభించారు. తోటి విద్యార్థుల నుంచి నిర్లక్ష్యం, నిరాదరణ అనుభవిస్తూనే హైదరాబాదులోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేశారు. అనంతరం ఇంటర్నీడియట్లో సైన్స్ గ్రూపులో ప్రవేశానికి ప్రభుత్వం నిరాకరించగా కోర్టు ద్వారా ప్రవేశం పొంది చిన్మయా దివ్యాంగ అంధుల విద్యాలయం నుంచి 98 శాతం మార్కులతో పూర్తి చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. యన్ఐటిలో అడ్మిషన్ పొంగడానికి ప్రయత్నించగా వారు నిరాకరించారు. ఇంజనీరు కావాలనే కాంక్ష పట్టుదల పెరిగి అమెరికాలోని ప్రతిష్టాత్మక మాచెస్ట్యూట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యంఐటీలో ప్రథమ అంతర్జాతీయ అంధ విద్యార్థిగా మేనేజ్‌మెంట్ సైన్స్ కోర్స్ పూర్తి చేసి చరిత్ర సృష్టించారు. అమెరికాలో పలు కంపెనీల ఉద్యోగాలు వచ్చినా దేశ సేవ చేయాలనే విలక్షణ లక్ష్యంతో ఇండియాకు వచ్చారు. 2012లో హైదరాబాదు చేరి 'బొల్లంట్ పరిశ్రమ'ను స్థాపించి లాభాల బాటన నడుపుతున్నారు. పరిశ్రమను పరుగులెత్తిస్తున్న బొల్లం ఈదడం, చెస్ ఆడడం, క్రికెట్ క్రీడల్లో రాణించారు.

48 మిలియన్ పౌండ్ల పరిశ్రమకు సిఈఓ:

శ్రీకాంత్ ప్రతిభను గుర్తించిన నవ సమాజం పలు పురస్కారాలను అందజేయడం జరుగుతోంది. ఏ పి జె అబ్దుల్ కలాం, ఆచార్య సుదర్శన్ ద్వయంతో కలిసి 'లీడ్ ఇండియా-2020'లో విశిష్ట సేవలను అందిస్తున్నారు. 2011లో దివ్యాంగులకు సమన్వయ కేంద్రాన్ని ప్రారంభించిన శ్రీకాంత్ ఆలోచనల ఫలితంగా బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభిమైంది. రతన్ టాటా సహకారంతో స్థాపించిన బొల్లంట్ ఇండస్ట్రీస్ ద్వారా వందల దివ్యాంగులకు ఉద్యోగాలు కలిపించారు. పర్యావరణ హిత దిశగా రీసైకిల్డ్ క్రాఫ్ట్ పేపర్, వ్యర్థాల నుంచి ప్యాకేజ్ ఉత్పత్తులు, సహజ ఆకుల నుంచి పేపర్, వ్యర్థ ప్లాస్టిక్ నుంచి ఉత్పత్తులను చేస్తున్న కంపెనీ సిఈఓగా 48 మిలియన్ పౌండ్ల టర్నోవర్ కలిగిన పరిశ్రమగా మలచగలిగారు. 2016లో సర్జ్ ఇంపాక్ట్ ఫౌండేషన్ స్థాపించి సుస్థిరాభివృద్ధి లక్ష్యం-2030 దిశగా అడుగులు వేస్తున్నారు.

వరించిన పురస్కారాల పంట:

2017లో ఆసియాలోనే 30 మంది ప్రతిభావంతుల ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకున్నారు. యంగ్ సర్వీస్, యూత్ ఎక్సలెన్స్, ఎంటర్‌ప్రూనర్ ఆఫ్ ది ఇయర్, యంగ్ చెంజ్ మేకర్, ఎమర్జింగ్ లీడర్‌షిప్, ఎమర్జింగ్ ఎంటర్ ప్రూనర్, నవ నక్షత్ర సన్మాన్, గ్లోబల్ ఫోరమ్ యంగ్ గ్లోబల్ లీడర్-2021 లాంటి పలు అవార్డులు పొందిన బొల్లం శ్రీకాంత్ నేటి సభ్య సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. బొల్లం శ్రీకాంత్ అసాధారణ జీవితం నేటి యువతకు, ముఖ్యంగా దివ్యాంగులకు ప్రేరణగా నిలవాలనే ఉద్దేశ్యంతో బాలీవుడ్ ఆక్టర్ రాజ్‌కుమార్‌రావు బయోపిక్ తీయడానికి పూనుకోవడం ముదావహం. అబ్దుల్ కలాం అభిమానాన్ని చూరగొన్న శ్రీకాంత్ జీవిత లక్ష్యం దేశ రాష్ట్రపతి కావాలనే ప్రగాఢ వాంఛ తీరాలని కోరుకుందాం. అంధత్వాన్ని సవాళుగా తీసుకొని చీకట్లను చిదివేస్తూ విజయ ఆకముద్దాడుతున్న బొల్లం జీవితం మనందరికీ ఆదర్శం, అనుసరణీయం, అభినందనీయం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి, 99497 00037

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన కలెక్టర్



విజయనగరం డిసెంబరు 2: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రారంభించారు. నీతానగరం మండలం సూరంపేట గ్రామ రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరికరాలు పరిశీలించారు. తూనిక యంత్రంపై ధాన్యం బస్తాను పెట్టి తూనికలను పరిశీలించారు. ధాన్యం తేమ శాతం తనిఖీ చేశారు. ధాన్యం రవాణా లారీకి జెండా ఊపి రవాణాకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ? ఖరీఫ్ 2023-24 నీజనుకు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లాలో 185 రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించడం జరిగిందని ఆయన చెప్పారు. ప్రభుత్వం ద్వారా ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. రైతులు తాము పండించిన ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్నట్లు చూడాలని, దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యంను విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలని ఆయన కోరారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ధాన్యం సేకరణ సహాయ ఏజన్సీలకు అనుసంధానం చేశామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించవద్దు..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంను విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఒక క్వింటాల్ కు ప్రభుత్వం సాధారణ రకంకు రూ.2183/- లు, గ్రేడ్-ఏ రకానికి రూ.2203/- లు నిర్ణయించిందని ఆయన చెప్పారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుల సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పని చేస్తుందని ఆయన చెప్పారు. జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 08963-293037, 7702003582లకు నేరుగా ఫోన్ చేసి సంప్రదించవచ్చని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్ నంబర్ 1800-4251967, రాష్ట్ర స్థాయి టోల్ ఫ్రీ నంబరు 1967 కూడా పనిచేస్తున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం డి నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి కె రాబర్ట్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడితో ప్రధాని సమావేశం

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2023 డిసెంబరు 1న 'యుఎఇ'లో కాప్-28 శిఖరాగ్ర సదస్సు సందర్భం గా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు మాననీయ షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో సమావేశవ ంయ్యారు.

కాప్-28 శిఖరాగ్ర సదస్సును విజయవంతంగా నిర్వహించడంపై గౌరవనీయ షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్‌ను ప్రధానమంత్రి అభినందించారు. అలాగే కాప్-28 వేదికపై హరిత వాతావరణ కార్యక్రమం (జిసిపి)పై ఉన్నతస్థాయి కార్యక్రమానికి సహాధ్యక్షత వహించడంపైనా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా దేశాధినేత లిద్దరూ రెండు దేశాల మధ్యగల విస్తృత-శక్తివంతమైన ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించారు. అలాగే ఇజ్రాయెల్-హమాస్ వివాదంపైనా వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కాగా, వచ్చే నెల 'ఉజ్వల గుజరాత్' సదస్సు నిర్వహణ నేపథ్యంలో భారత పర్యటనకు రావాల్సిందిగా మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌ను ప్రధానమంత్రి ఆహ్వానించారు.

బంగాళాఖాతంలో 'మిచాంగ్' తుఫాను నిర్వహణ సంసిద్ధతపై జాతీయ విపత్తు నిర్వహణ కమిటీ సమావేశంలో సమీక్ష

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:బంగాళాఖాతంలో 'మిచాంగ్' తుఫాను నేపథ్యంలో విపత్తు నిర్వహణపై రాష్ట్ర/కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాల సంసిద్ధతను సమీక్షించేందుకు మంత్రిమండలి కార్యదర్శి శ్రీ రాజీవ్ గౌబా అధ్యక్షతన జాతీయ సంక్షోభ నిర్వహణ కమిటీ (ఎన్సీఎంసీ) ఇవాళ సమావేశమైంది.

ఈ సందర్భంగా తుఫాను ప్రస్తుత స్థితి గురించి భారత వాతావరణ విభాగం (ఐఎండి) డైరెక్టర్ జనరల్ కమిటీకి వివరించారు. ఆగ్నేయ-సమీప నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం గంటకు 13 కిలోమీటర్ల వేగంతో గడచిన 6 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా కదిలింది. అనంతరం ఇప్పుడు భారత కాలమానం ప్రకారం 11:30 గంటల సమయానికి అదే ప్రాంతంలో 9.5 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 86.0 డిగ్రీల తూర్పు రేఖాంశం మధ్య ఉంది. ఈ మేరకు పుదుచ్చేరికి తూర్పు- ఆగ్నేయంగా దాదాపు 730 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పు-ఆగ్నేయంగా 740 కిలోమీటర్లు, నెల్లూరుకు ఆగ్నేయంగా 860 కిలోమీటర్లు, బాపట్లకు ఆగ్నేయంగా 930 కిలోమీటర్లు, మచిలీపట్నానికి ఆగ్నేయంగా 910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది.

ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ శనివారం (2వ తేదీ) నాటికి తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. అలాగే డిసెంబరు 3 నాటికి నైరుతి బంగాళాఖాతం మీదుగా తీవ్ర తుఫానుగా మారుతుందని అంచనా. అటుపైన వాయవ్య దిశగా పయనిస్తూ డిసెంబరు 4వ తేదీ మధ్యాహ్నానికి దక్షిణ ఆంధ్రప్రదేశ్, సమీపంలోని ఉత్తర తమిళనాడు తీరాలకు చేరవవుతుంది. ఆ తర్వాత దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరానికి దాదాపు సమాంతరంగా ఉత్తరం దిశగా కదులుతూ, మరింత తీవ్రమై డిసెంబరు 5వ తేదీ ఉదయం నెల్లూరు-మచిలీపట్నం మధ్య దక్షిణాంధ్ర తీరం దాటుతుంది. తుఫాను తీరందాటే సమయంలో గంటకు 80-90 కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్ల వేగంతో పెనుగా లులు వీస్తాయి.

ఈ నేపథ్యంలో తుఫాను పయనించే మార్గంలోని తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులతోపాటు పుదుచ్చేరి ఆర్థికశాఖ తమతమ పరిధులలో సంసిద్ధతపై ప్రజల ప్రాణ-ఆస్తి నష్టం నివారణకు తామే కాకుండా స్థానిక సంస్థల సహకారంతో చేపట్టిన సన్నాహక చర్యల గురించి కమిటీకి వివరించారు. ఈ చర్యల్లో భాగంగా సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని మత్స్యకారులను హెచ్చరించినట్లు తెలిపారు. తగిన షెల్టర్లు, విద్యుత్ సరఫరా, మందులు మరియు అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచారు. అంతేకాకుండా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ముందు జాగ్రత్త చర్యగా పునరావాస కల్పన కోసం భవనాలు సిద్ధంగా ఉంచామన్నారు. అలాగే విద్యుత్ సరఫరా, మందుల లభ్యతసహా అత్యవసర సేవల సిబ్బందిని సన్నద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

తుఫాను నేపథ్యంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, పుదుచ్చేరి రాష్ట్రాల్లో పరిస్థితుల నిర్వహణ కోసం 18 బృందాలను జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) సిద్ధంగా ఉంచింది. అవసరాన్ని బట్టి రంగంలో దిగడం కోసం అదనంగా మరో 10 బృందాలను కూడా సంసిద్ధం చేసింది. తీర రక్షక దళం, సైన్యం, నావికాదళం తదితరాలకు చెందిన రక్షణ-సహాయ బృందాలు, ఓడలు, విమానాలను కూడా సిద్ధంగా ఉంచారు.

సమావేశంలో భాగంగా కేంద్ర సంస్థలతోపాటు తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, ఒడిషా, పుదుచ్చేరి ప్రభుత్వాల సంసిద్ధత చర్యలను సమీక్షించిన అనంతరం అవసరమైన అన్ని నివారణ-ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాల్సిందిగా కేంద్ర మంత్రి మండలి కార్యదర్శి ఆయా రాష్ట్రాల అధికారులకు స్పష్టం చేశారు. ఈ చర్యలన్నీ ప్రాణ-ఆస్తి నష్టంతోపాటు మౌలిక సదుపాయాల నష్ట నివారణ లక్ష్యంగా ఉండాలన్నారు. తుఫాను తీరం దాటే సమయంలో కలిగే అవాంతరాలను త్వరితగతిన సరిదిద్ది, సాధ్యమైనంత తక్కువ సమయంలో సేవలను పునరుద్ధరించాలని కోరారు.

ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులను సురక్షితంగా తీరానికి తీసుకొచ్చేలా చూడాలని చెప్పారు. అలాగే చమురు అన్వేషణ రిగ్గులు, నౌకలు తదితరాల్లో నియమితులైన సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తదనుగుణంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, పుదుచ్చేరి ప్రభుత్వాలు అప్రమత్తమైన నేపథ్యంలో వాటికి ఎలాంటి సహాయం అవసరమైనా అందించేందుకు కేంద్ర సంస్థలన్నీ సిద్ధంగా ఉన్నట్లు మంత్రిమండలి కార్యదర్శి ప్రకటించారు.

ఈ సమావేశంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, పుదుచ్చేరి ఆర్థికశాఖ కార్యదర్శిసహా కేంద్ర హోం, మత్స్య, విద్యుత్ శాఖల కార్యదర్శులు; ఓడరేవులు-షిప్పింగ్-జల మార్గాలు/పెట్రోలియం-సహజవాయువు/టెలికాం మంత్రిత్వ శాఖల అదనపు కార్యదర్శులతోపాటు ఎన్డీఎంఎ సభ్య కార్యదర్శి, ఐఎండి డైరెక్టర్ జనరల్, తీర రక్షక దళం డైరెక్టర్ జనరల్, ఎన్డీఆర్ఎఫ్ ఇన్స్ పెక్టర్ జనరల్, హోం శాఖ సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ .

మెదక్, డిసెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి):అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ ఎన్నికల్లో భాగంగా, నవంబర్ 30వ తేదీన జరిగిన పోలింగ్ అనంతరం ,ఈనెల 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరుగునున్న కౌంటింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర అదనపు ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో కౌంటింగ్ కార్యక్రమం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రంలో టేబుల్లు, కౌంటర్లు, మీడియా, రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన ఏజెంట్లు ఇతరత్రా అన్ని ఏర్పాట్లను నిబంధనలకు లోబడి చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, /కలెక్టర్ రాజర్షి షా వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మెదక్ -34 , నర్సాపూర్ -37 రెండు నియోజకవర్గాలకు కలిపి జిల్లా కేంద్రంలోని జఖ్ఖీ బిఈడి కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసి పూర్తి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ర్యాండం ప్రకారం వి వి ప్యాట్లలోని స్లిప్పులు లెక్కింపు జరుగుతుందని, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు,ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా దిగుమతి చేసుకున్న రూ.55 లక్షలకు పైగా విలువైన విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్న దిల్లీ కస్టమ్స్ అధికార్లు, కేసు నమోదు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:అక్రమంగా దిగుమతి చేసుకున్న రూ.55 లక్షలకు పైగా విలువైన విదేశీ సిగరెట్లను దిల్లీ కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ అధికార్లు నిన్న స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.55 లక్షల విలువైన 5,48,800 విదేశీ సిగరెట్లను జప్తు చేశారు.

ప్లాటినం సెవెన్, దేవిడాఫ్, డన్‌హిల్, మోండ్ సహా వివిధ బ్రాంట్ల సిగరెట్లను అధికార్లు స్వాధీనం చేసుకున్నారు.

జప్తి చేసిన విదేశీ సిగరెట్ ప్యాకెట్ల మీద చిత్రంతో కూడిన ఆరోగ్య హెచ్చరికలు లేవు.

కస్టమ్స్ సుంకం ఎగ్గొట్టి విదేశీ సిగరెట్లను దేశంలోకి అక్రమంగా దిగుమతి చేసుకున్నారని, 'సిగరెట్లు డ ఇతర పొగాకు ఉత్పత్తులు (ప్యాకేజింగ్ డ లేబులింగ్) సవరణ నియమాలు, 2022'ని కూడా ఉల్లంఘించారని, వాటిని దేశీయ మార్కెట్‌లో సరఫరా చేస్తున్నారని అధికార్లు అనుమానిస్తున్నారు.

కస్టమ్స్ చట్టం 1962లోని సెక్షన్ 104 కింద ఒక నిందితుడిని అరెస్టు చేసి, ఆ తర్వాత బెయిల్‌పై విడుదల చేశారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోంది.

బిఎస్ఎఫ్ యొక్క స్థాపన ప్రశంసనీయం

న్యూఢిల్లీ,డిసెంబర్ 2:బిఎస్ఎఫ్ స్థాపన దినం సందర్భం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన శుభాకాంక్షల ను వ్యక్తం చేశారు.

"బిఎస్ఎఫ్ యొక్క స్థాపన దినం నాడు, మనం ఈ యొక్క ఉత్కృష్టమైన బలగాన్ని ప్రశంసించుదాం; ఈ దళం మన సరిహద్దుల కు ఒక సంరక్షకురాలు గా తనదైన ముద్ర ను వేసింది. మన దేశ ప్రజల ను రక్షించడం లో వారు చాటుతూ వస్తున్న పరాక్రమం మరియు మొక్కవోనటువంటి ఉత్సాహం వారి యొక్క సమర్పణ భావాని కి ప్రమాణం గా ఉన్నది. ప్రాకృతిక విపత్తుల వేళల్లో రక్షణ మరియు సహాయం సంబంధి కార్యకలాపాల లో బిఎస్ఎఫ్ పోషించినటువంటి పాత్ర ను కూడా నేను ప్రశంసించదల చుకొన్నాను." అని పేర్కొన్నారు.

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న చంద్రబాబు

అమరావతి, డిసెంబర్ 2:విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఉన్న కనీస దుర్గమ్మ దర్శనానికి శనివారం సతీసమేతంగా చంద్రబాబు లాగా ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో చంద్రబాబుకి స్వాగతం పలికిన ఇన్చార్జి ఈవో, ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. జగన్మాతకు ప్రత్యేక పూజలను చంద్రబాబు దంపతులు నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేయగా ఆలయ ఈ కోటేశ్వరరావు, ఏఈఓ చంద్రశేఖర్, స్థానాచార్యులు ఇతర అధికారులు అమ్మవారి చిత్రపటం ప్రసాదాలను చంద్రబాబు దంపతులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎంపీ కేసినేని నాని జిల్లా పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం తో పాటు తెదేపా నేతలు కేశినేని చిన్ని, ఎమ్మెల్సీ పంచమర్తి అనురాధ, అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ వెంకన్న, మాజీ మంత్రులు దేవినేని ఉమా కొల్లు రవీంద్ర మాజీ ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య బోండా ఉమా మాజీ ఎంపీ మాగంటి బాబు ద్వితీయ శ్రేణి తృతీయని కార్యకర్తలు నాయకులు ఉన్నారు.

ఈనెల ఐదో తేదీన శ్రీశైలం మల్లన్న సేవలో చంద్రబాబు పాల్గొననున్నారు. అలాగే రానున్న రోజుల్లో కడప దర్గా, గుణదల మేరీ మాత చర్చిలను తెలుగుదేశం అధినేత చంద్రబాబు దర్శించుకోనున్నారు.

పవన్ సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ కీలక నేతలు

అమరావతి, డిసెంబర్ 2:ఏపీలోని వైసీపీ కీలక నేతలు జనసేన పార్టీలో చేరారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమక్షంలో మంగళగిరి కేంద్ర కార్యాలయంలో నాలుగు జిల్లాలకు చెందిన వైసీపీ ముఖ్య నేతలు జనసేన పార్టీలో చేరారు.. పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ జనసేన కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

జనసేన పార్టీలో చేరిన నేతలు చిలకలపూడి పాపారావు సర్పంచ్, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కృష్ణా జిల్లా వైసీపీ నేత.. చిక్కాల దొరబాబు- తూర్పుగోదావరి వైసీపీ నాయకులు, దుగ్గన నాగరాజు- తూర్పుగోదావరి వైసీపీ నాయకులు, కలగ పాల్ పురుషోత్తం - తూర్పుగోదావరి వైసీపీ నాయకులు, ఎదురువాక వెంకటగిరి- తూర్పుగోదావరి వైసీపీ నాయకులు, పొగిరి సురేష్ బాబు శ్రీకాకుళం జిల్లా వైసీపీ నాయకులు, వై శ్రీనివాస్ రాజు - కడప జిల్లా వైసీపీ నాయకులతో పాటు.. మరికొందరు నేతలు కూడా పార్టీలో చేరారని జనసేన పార్టీ నేతలు తెలిపారు.

భారత్‌ను ముందుకు నడిపిస్తున్న పవర్ ఆఫ్ 30 - ముప్పై ఏళ్ళలోపు ఆర్థిక వ్యవస్థకు 30 ట్రిలియన్ యుఎస్ డాలర్లను జోడించాలన్న స్వప్నం

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:ముప్పై ఏళ్ళ జనాభా కృషితో 30 ఏళ్ళలోపు మన ఆర్థిక వ్యవస్థకు 30 ట్రిలియన్ల యుఎస్ డాలర్లను జోడించాలన్న స్వప్నమైన పవర్ ఆఫ్ 30 భారత్‌ను నేడు ముందుకు నడిపిస్తోంది. శుక్రవారంనాడు భారత చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఇన్‌స్టిట్యూట్ బ్రహ్మోయిన్ చాప్టర్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ, జౌళి శాఖల మంత్రి శ్రీ పీయూష్ గోయెల్ పేర్కొన్నారు. భారత్ పెట్టుబడిదారులకు అంతర్జాతీయ స్థాయిలో కీలక స్థానమని, రెండు రోజుల కిందట మార్కెట్ మూలధన సంగ్రహణ 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని ఆయన అన్నారు.

నేడు భారతదేశం ప్రపంచంతో ఆత్మవిశ్వాసం, అసమానమైన, స్థిరమైన విశ్వాసపు స్ఫూర్తితో ముందుకు వెడుతోంది తప్ప అహంకారంతో కాదని శ్రీ గోయెల్ పేర్కొన్నారు. భారత్‌లో పదేళ్ళ కాలంలో మన రేవుల సామర్థ్యం, కార్యకలాపాలు నిర్వహిస్తున్న వాణిజ్య విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి గత తొమ్మిదేళ్లలో 150కుపైగా పెరిగి, రానున్న ఐదేళ్ళ కాలంలో 225కు పెరుగనున్న అంచనాతో, రైల్వేలు, అత్యాధునిక, నాణ్యత కలిగిన హైవేలకు అనుబంధంగా 140 నూతన లోతట్టు జలమార్గాలను గల ఆర్థిక వ్యవస్థ అని ఆయన అన్నారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో కనిపించే అందమైన మౌలిక సదుపాయాలను ఇప్పుడు భారత్‌లో సృష్టిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ప్రేక్షకులను ఢిల్లీ వచ్చి కొంత సమయం నూతన పార్లమెంట్ హౌజ్‌లోనో లేదా అత్యున్నత ప్రమాణాలు కలిగిన అంతర్జాతీయ ప్రదర్శనలను నిర్వహిస్తున్న భారత్ మండపంలో గడపవలసిందిగా ఆయన ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. భారత ప్రజల బాధ్యత తీసుకుని, వారికి మంచి భవిష్యత్తును, సులభంగా నాణ్యమైన జీవితాన్ని గడిపే అవకాశాలను ఇస్తున్న వ్యవస్థ అయిన సుసంపన్నమైన, శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థను వీక్షించవలసిందిగా కోరారు. నేడు భారత్ స్థిరత్వాన్ని ప్రతిఫలించే 5 జి - గ్రోత్, గుడ్ గవర్నెన్స్, గ్రిట్, జెన్యూన్ ట్రస్ట్ అండ్ గ్రీన్ టెక్నాలజీస్ (వృద్ధి, సుపరిపాలన, స్థైర్యం, నిజమైన విశ్వాసం, హరిత సాంకేతికతలు) ప్రేరణలో ముందు వరుసలో ఉందని ఆయన అన్నారు.

దాదాపు 450మంది సభ్యులతో బ్రహ్మోయిన్‌లో గల అతిపెద్ద వృత్తిపరమైన వ్యవస్థీకృత సంస్థ చార్టెర్డ్ అకౌంటెంట్లదని శ్రీ గోయెల్ అన్నారు. వారు అత్యంత చిత్తశుద్ధి, అత్యున్నత నైతికత, కష్టపడి పనిచేయడం పట్ల అచంచలమైన నిబద్ధతతో బ్రహ్మోయిన్ అభివృద్ధిలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా, బ్రహ్మోయిన్‌కు చార్టెర్డ్ అకౌంటెంట్లు భారత రాయబారులని ఆయన పేర్కొన్నారు. బ్రహ్మోయిన్‌కు మన రాయబారులుగా వారు తమ తోడ్పాటు, ఆలోచనలతో చేస్తున్న అద్భుతమైన పనితో, తమ నిబద్ధత, అంకితభావం, సమగ్రత, కృషి, అభిరుచితో భారతదేశం గర్వపడేలా చేస్తున్నందుకు ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమకాలీనమైన, అవసరమైన నాయకత్వం, స్థిరత్వం, జియోపాలిటిక్స్, మానవ సంభావ్యత, ఆరోగ్యకరమైన జీవనం వంటి అంశాలపై చర్చను నిర్వహిస్తున్నందుకు వారిని అభినందించారు.

దూసుకెళ్తున్న సూర్యుడి అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య ఎల్1 మిషన్

న్యూఢిల్లీ డిసెంబర్ 2(ఎక్స్ ప్రెస్ న్యూస్): సూర్యుడి అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య ఎల్1 మిషన్ దూసుకెళ్తున్నది. అయితే ఆ శాటిలైట్‌లో ఉన్న ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ పేలోడ్ సౌర గాలుల స్టడీని ప్రారంభించింది. ఆ స్టడీకి చెందిన నివేదికను ఇస్రో రిలీజ్ చేసింది. ప్రస్తుతం సోలార్ పేలోడ్ తన ఆపరేషన్స్ సక్రమంగా చేస్తున్నట్లు ఇస్రో వెల్లడించింది. విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్‌లో రెండు పరికరాలు ఉన్నాయి. దాంట్లో సోలార్ విండ్ ఐయాన్ స్పెక్ట్రోమీటర్, సూప్రా థర్మల్ అండ్ ఎనర్జిటిక్ పార్టికల్ స్పెక్ట్రోమీటర్ ఉన్నాయి. సూప్రా థర్మల్ పరికరం సెప్టెంబర్ 10వ తేదీ నుంచి యాక్షన్‌లో ఉంది. ఇక ఐయాన్ స్పెక్ట్రోమీటర్ శనివారమే తన పని ప్రారంభించింది. స్పెక్ట్రోమీటర్ పనితీరు బాగానే ఉందని ఇస్రో చెప్పింది. ఆదిత్య పేలోడ్ పరికరం తీసిన ఫోటోను ఇస్రో తన ఎక్స్ అకౌంట్‌లో షేర్ చేసింది. ప్రోటాన్, ఆల్ఫా పార్టికల్స్‌లో ఉన్న ఎనర్జీ తేడాలను ఈ ఫోటోలో గమనించవచ్చు. రెండు రోజుల్లో ప్రోటాన్, ఆల్ఫా పార్టికల్ కౌంట్‌లో తేడా ఉన్నట్లు ఆదిత్య శాటిలైట్ గుర్తించినట్లు తెలుస్తోంది.

ఆయుష్ రంగంలో వ్యవస్థాపకత అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది- కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి శ్రీ శర్వానంద్ సోనోవాల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:అంతర్జాతీయ ఆయుర్వేద ఉత్సవాన్ని తిరువనంతపురంలో కేంద్ర ఆయుష్, ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శ్రీ శర్వానంద్ సోనోవాల్ ఈరోజు ప్రారంభించారు. సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ సోషల్ యాక్షన్ సహకారంతో నిర్వహిస్తున్న అంతరాతీయ ఆయుర్వేద ఉత్సవం డిసెంబర్ 5 వరకు జరుగుతుంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో ఆయుర్వేద రంగంలో సాధించిన ప్రగతి, ఆయుర్వేదం ప్రయోజనాలు ప్రపంచ దేశాలకు తెలియజేయడానికి అంతర్జాతీయ ఆయుర్వేద ఉత్సవం నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు.. ఆయుష్ రంగంలో అభ్యాసకులు, వాటాదారులు ఆవిష్కరణకు ప్రాధాన్యత ఇచ్చి సహకార స్ఫూర్తితో పని చేయాలని ఆయన సూచించారు.

డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు కేరళలోని తిరువనంతపురంలో జరుగుతున్న అంతర్జాతీయ ఆయుర్వేద ఉత్సవంలో వివిధ దేశాలకు చెందిన ఆయుర్వేద పరిశోధకులు, ప్రముఖులు పాల్గొంటున్నారు.

శ్రీ సోనోవాల్ జాతీయ ఆరోగ్య మేళాను కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి శ్రీ వి.మురళీధరన్, ఆయుష్ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటేచా తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయుష్ మంత్రిత్వ శాఖలోని ఇతర అధికారులు పాల్గొన్నారు. అంతర్జాతీయ ఆయుర్వేద ఉత్సవం, ఆరోగ్య ఎక్స్‌పోతో పాటు ఈ మేళా నిర్వహిస్తున్నారు. పురాతన జ్ఞానం, ఆధునిక పురోగతి మధ్య అంతరాన్ని తగ్గించడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో చురుగ్గా పాల్గొనాలని నిపుణులు, పరిశోధకులకు శ్రీ సోనోవాల్ విజ్ఞప్తి చేశారు.

ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తూ సహకార స్ఫూర్తితో పనిచేయాలని ఆయుష్ అభ్యాసకులు, సంబంధిత వర్గాలకు ఆయుష్ మంత్రి సూచించారు. ఆయుష్ రంగంలో ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఇష్టపడే వారికి కూడా ప్రభుత్వం సౌకర్యాన్ని కల్పిస్తుందని హామీ ఇచ్చారు. ఆయుష్ రంగంలో వ్యవస్థాపకత అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపిన శ్రీ శర్వానంద్ సోనోవాల్ ఆయుష్ రంగంలో స్టార్టప్‌లను స్థాపించడానికి యువ పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు ఆయన అన్నారు.

అభివృద్ధి చెందుతున్న ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవడంలో భారతదేశ సాంప్రదాయ వైద్యం, ముఖ్యంగా ఆయుర్వేద వైద్య విధానాలు కీలకంగా ఉంటాయని విదేశాంగ శాఖ సహాయ మంత్రి శ్రీవి మురళీధరన్ అన్నారు. ఇటీవల నీతి ఆయోగ్ నిర్వహించిన అధ్యయనంలో సంప్రదాయ వైద్య వ్యవస్థ పటిష్టత వెల్లడైందన్నారు.

ఆయుష్ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేష్ కోటేచా దేశంలో నాణ్యమైన విద్య రంగంలో సాధించిన ప్రగతిని వివరించారు. విద్యా ప్రమాణాలు మెరుగు పరచడానికి ఎన్సిఎంఎం చేసిన కృషిని ఆయన అభినందించారు. జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా ప్రజారోగ్యంలో సాధించిన ప్రగతిని ఆయన వివరించారు. అనేక జిల్లాల్లో ఆయుష్ కేంద్రాలు విస్తరిస్తున్నాయని ఆయన అన్నారు. శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించడం, కీలకమైన క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడం, సంప్రదాయం ఔషధ వ్యవస్థల్లో సాక్ష్యం-ఆధారిత వద్ధతులు ప్రోత్సహించడానికి ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న పరిశోధనా మండలి ద్వారా కృషి జరుగుతుందని అన్నారు. సహకార అధ్యయనాలు , ముఖ్యంగా ఇంటిగ్రేటివ్ మోడల్‌లలో చురుకుగా పాల్గొంటున్ననిపుణులను ఆయన అభినందించారు.

ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారతదేశం ప్రాధాన్యత : శ్రీ గోయల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో భారతదేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుని అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అన్నారు. 'కొవ మూలధన రుణ మార్కెట్ సదస్సు 2023-- ముందుకు, పైకి' ప్రారంభ కార్యక్రమంలో శ్రీ గోయల్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగం పెట్టుబడుల వల్ల దేశంలో మౌలిక సదుపాయాల సామర్థ్యాలు పెరుగుతాయని కేంద్ర మంత్రి అన్నారు. భద్రతతో కూడిన పెట్టుబడుల కోసం ఎదురు చూస్తున్న వారిని పోటీ మూలం ఎక్కువగా ఉన్న రంగం సరైన అవకాశం అని ఆయన తెలిపారు. భారతదేశ . స్టాక్ మార్కెట్ కూడా తొలిసారిగా 4 ట్రిలియన్ల మార్కును దాటిందన్నారు. , ప్రపంచ మార్కెట్లలో మొదటి ఐదు స్థానాల్లో ఉన్న భారతదేశంలో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయన్నారు.ప్రస్తుత త్రైమాసికంలో 7.6% వృద్ధితో దేశం ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఒకటి అని ఆయన వివరించారు. . "ప్రపంచం ఈ రోజు భారతదేశాన్ని విశ్వసిస్తోంది" అని శ్రీ గోయల్ అన్నారు. అత్యంత విశ్వసనీయ భాగస్వామిగా, చట్టబద్ధమైన పాలనను గుర్తించి, గౌరవించే ప్రజలు ఉన్న ప్రజాస్వామ్య భారతదేశం ఉజ్వల భవిష్యత్తు కలిగి ఉందని మంత్రి పేర్కొన్నారు.

అమృత్ కాలంలో అభివృద్ధి చెందిన, సంపన్నమైన వికసిత భారతదేశం నిర్మాణం కోసం కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని శ్రీ గోయల్ తెలిపారు. . 2047 నాటికి భారతదేశ ఆర్థిక వ్యవస్థ త్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని ఆయన అన్నారు.

ఆవిష్కరణలు, వ్యవస్థాపక శక్తి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి మూలధన రుణ మార్కెట్ అవసరమని శ్రీ గోయల్ అన్నారు. టైర్ 2 నగరాలు కూడా మెట్రోపాలిటన్ నగరాలుగా అభివృద్ధి చెందుతున్న సమయంలో రాబోయే కొన్ని దశాబ్దాల్లో భారీ పట్టణీకరణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. "గ్రామీణ ప్రాంతాల ఆదాయాలు పెరుగుతున్నాయి, దేశవ్యాప్తంగా ఖర్చు చేసే సామర్థ్యం పెరిగింది" అని పేర్కొన్న శ్రీ గోయల్ ఏఐ సెమీ కండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి భవిష్యత్ రంగాలు భవిష్యత్తులో కీలకంగా ఉంటాయన్నారు.హరిత, స్థిరమైన ఇంధన రంగంలో అభివృద్ధి సాధనకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కర్బన ఉద్గారాలు తగ్గించి ఇంధన పరివర్తన సాధించడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో మూలధన మార్కెట్ , రుణ మార్కెట్ పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. నష్టం భయం లేకుండా భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలని శ్రీ గోయల్ కార్పొరేట్ ప్రపంచాన్ని కోరారు.

2010- 2013 మధ్య, బలహీనమైన స్థూల-ఆర్థిక మూలాధారాలు, విదేశీ మారకద్రవ్య సంక్షోభం మరియు 2013లో ఈఅఔఖి బాండ్లను పెంచడం ద్వారా విదేశీ రుణాలపై గణనీయమైన అధిక వడ్డీ రేటును చెల్లించాల్సి వచ్చిందని శ్రీ గోయల్ తెలిపారు. ద్రవ్యోల్బణం 10%నుంచి 12% వరకు ఉందన్నారు. బ్యాంకు అప్పులు అహేతుకంగా పెరిగాయని, ఆర్థిక లోటు ఎక్కువగా ఉండేదని మంత్రి వివరించారు. 2014లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. సులభతరమైన వ్యాపారం,సమ్మతి భారాన్ని తగ్గించడం, అనేక చట్టాలను రద్దు చేయడం, చట్ట పరిధి నుంచి అనవసర నిబంధనలు తొలగించడంపై ప్రధాన మంత్రి చాలా దృష్టి సారించి ప్రధానమంత్రి చర్యలు అమలు చేశారని మంత్రి తెలిపారు. " గత 10 సంవత్సరాల కాలంలో భారతదేశం ఒక సంపూర్ణ ప్రణాళిక అమలు చేసి విదేశీ మారక నిల్వలు రెట్టింపు చేయడంలో విజయం సాధించింది. ," అని ఆయన అన్నారు,ప్రస్తుతం భారతదేశం సురక్షిత స్థానంలో ఉందని తెలిపిన శ్రీ గోయల్ భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు ఎదుర్కోదని అన్నారు.

భారతదేశం నుంచి వస్తువులు, సేవల ఎగుమతులు దాదాపు 55% పెరిగాయని శ్రీ గోయల్ తెలిపారు. 2021లో 500 బిలియన్ల వస్తువులు, సేవల ఎగుమతులు జరిగాయని గత సంవత్సరం ఈ విలువ 776 బిలియన్లకు చేరిందని శ్రీ గోయల్ చెప్పారు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో మాంద్యం ఏర్పడే అవకాశం ఉందని ఆయన అన్నారు. అయితే, ప్రస్తుత సంవత్సరంలో కూడా ఎగుమతులు పెరుగుతాయని భావిస్తున్నామని ఆయన అన్నారు.

ఇరుగుపొరుగు మధ్య గొడవ.. ఏకంగా సీసీరోడ్డుపై గోడ

గుంటూరు, డిసెంబర్ 2:ఇరుగుపొరుగు మధ్య మనస్పర్థలు మధ్యలో సీసీరోడ్డు గోడ కట్టే పరిస్థితికి దారితీసింది. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం కారుమంచిలో మాత్రం ఈ గొడవ ఏకంగా రాష్ట్రం దృష్టిని ఆకర్షించింది.

గ్రామానికి చెందిన కిలారు లక్ష్మీనారాయణ, కిలారు చంద్రశేఖర్ ఇళ్లు ఎదురెదురుగా ఉన్నాయి. మధ్యలో సీసీరోడ్డు ఉంది. లక్ష్మీనారాయణ తన ఇంటి మెట్లను రోడ్డుపైకి వచ్చేలా కట్టడంతో చంద్రశేఖర్ అభ్యంతరం తెలిపాడు. ఆ తర్వాత ఈ గొడవ పోలీసుల వద్దకు, గ్రామ పెద్దల వద్దకు చేరింది. చివరికి పంచాయతీ సిబ్బంది ఇద్దరి మధ్య రాజీ కుదిర్చారు. చంద్రశేఖర్ ఇటీవల తన ఇంటిముందున్న మురుగుకాల్వపై మెట్లు కట్టాడు. నిరసనగా లక్ష్మీనారాయణ ఏకంగా సీసీ రోడ్డు మధ్యలో మూడు అడుగుల ఎత్తులో పొడవుగా గోడకట్టేశాడు. దీంతో చిన్న గొడవ కాస్తా పెద్దదిగా మారి ఏకంగా రాష్ట్రం దృష్టినే ఆకర్షించింది. రోడ్డు మధ్యలో గోడ కట్టినప్పటికీ అధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడం గమనార్హం.

వామన ఆశ్రమ మహా స్వామిజీ ఆధ్వర్యంలో వైభవంగా లక్ష పుష్పార్చన

హైదరాబాద్, డిసెంబర్ 2: కొత్తపేట్ కన్యకా పరమేశ్వరి టెంపుల్ లో శనివారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళా విభాగం నిర్వహించిన లక్ష పుష్పార్చన కార్యక్రమం శ్రీ శ్రీశ్రీ వామన ఆశ్రమ మహా స్వామిజీ ఆధ్వర్యంలో జరిగినది. ఈకార్యక్రమంలో 500 మంది మహిళల పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐవీఎఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్ పూర్వ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, మహిళా విభాగం ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, అధ్యక్షురాలు చంద భాగ్యలక్ష్మి, శైలజ, మణిమాల, అనిత, జేయ శ్రీ, అర్చన, వీణ కుమారి ల ఆధ్వర్యంలో జరిగిన లక్ష పుష్ప అర్చన కార్యక్రమం విజయవంతమైంది.

ఈ కార్యక్రమానికి హాజరైన వారు బొగ్గారపు దయానంద్ ఎమ్మెల్సీ, ఐవీఎఫ్ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రెటరీ పబ్బా చంద్రశేఖర్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ కటకం శ్రీనివాస్, అడ్వైజర్ ముత్యాల సత్తయ్య, యువజన అధ్యక్షుడు కట్ట రవికుమార్, ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ బోనగిరి శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభు పాండయ్య గుప్తా, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ యువజన నాయకుడు శ్రీధర్, ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఐవీఎఫ్ కుటుంబ సభ్యులు, వైశ్య మహిళలు, వైశ్య ప్రముఖులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎయిడ్స్ అనే మహమ్మారిని తరిమి కొడదాం..

-ఎయిడ్స్ డే సందర్భంగా మహిళచే లలితాదేవి అమ్మవారి కి పారాయణం

హైదరాబాద్ డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఎయిడ్స్ డే సందర్భంగా ఖైరతాబాద్ వెంకట రమణ కాలనీ వెంకట లోని రమణ మహిళా మండలి అధ్యక్షురాలు ఒ. అనురాధ గారు (ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఓ. అ సభ్యులు) ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఎయిడ్స్ అనే మహమ్మారిని తరిమి కొడదాం అని మహిళ చే లలితా దేవి అమ్మవారి కి పారాయణం చేశారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఓ. ఓ. జ ద్వారా ప్రతి నెలా హెల్త్ క్యాంప్ 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు మందులు ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో వెంకట రమణ మహిళా మండలి సభ్యులు సరళ, రత్నంబా, ఆ. సురేఖ, శ్యామల, ఃు. సరోజిని, సుగుణ, కుమారి , ఉ. వనిత, కిరణ్మాయి, చి. పద్మావతి, గౌరి, మాధవి, మరియు రెడ్ క్రాస్ ఆఫీసు స్టాఫ్ సభ్యులు ంఖ లక్ష్మి, ం. సత్య లక్ష్మి, ఉ. స్వరూప ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లెటెంట్ ట్యూబెర్ క్యూలోసిస్‌పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఏఐఐఏ) దేశంలోని గుప్త క్షయవ్యాధి ఇన్‌ఫెక్షన్ (ఎల్‌టిబిఐ)ని నివారించడానికి సమగ్ర శిక్షణ మరియు ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను నేటి నుండి ప్రారంభించింది. ఇది డిసెంబర్ 2, 2023న ముగుస్తుంది. ఈ వర్క్‌షాప్ ప్రత్యేకంగా ఢిల్లీ మరియు హర్యానా రాష్ట్రానికి చెందిన ఆయుర్వేద వైద్య అధికారుల కోసం నిర్వహించబడుతుంది. అంతే కాకుండా సోషల్ మీడియా లైవ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలు కూడా ఇందులో భాగమవుతున్నారు.

భారతదేశంలోనే కాదు ప్రపంచంలో ఎక్కువమంది గుప్త క్షయ వ్యాధితో బాధపడుతున్నారు. ఇందులో టీబీ బ్యాక్టీరియా శరీరంలో నిద్రాణస్థితిలో ఉంటుంది. దీనిని నివారించడానికి, వివిధ రక్త పరీక్షలు లేదా టీఎస్‌టీ పరీక్షలను చేయించుకోవడం అవసరం. పాజిటివ్‌గా తేలితే ఎక్స్- రే చేయించాలి. ఈ రెండు రోజుల వర్క్‌షాప్‌లో వ్యాధిని అర్థం చేసుకోవడం, దాని చికిత్స మరియు నిర్వహణకు సంబంధించిన సమాచారం వివిధ సెషన్‌లలో ఇవ్వబడుతుంది. అంతే కాకుండా వర్క్‌షాప్‌లో ఆయుర్వేద నిర్వహణ గురించి సమాచారం ఇవ్వబడుతుంది. ఆయుష్ మంత్రిత్వ శాఖ మరియు ఆరోగ్య మంత్రిత్వ శాఖ యొక్క టిబికి సంబంధించిన వివిధ పథకాల గురించి అవగాహన పంచుకోబడుతుంది. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన టిబి రహిత భారతదేశం ప్రచారాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలనే దానిపై చర్చ జరుగుతుంది. టీబీ రహిత భారత్‌కు ఆయుర్వేదం దోహదపడుతుంది. ఈ విషయంలో ఏఐఐఏ చేసిన కేస్ స్టడీస్‌ను కూడా దేశం మరియు ప్రపంచం ముందుకు తీసుకువెళతారు.

ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ తనూజ మనోజ్ నేసరి మాట్లాడుతూ ప్రధానమంత్రి నేతృత్వంలో 2025 నాటికి టీబీని నిర్మూలించే దిశగా పయనిస్తున్నామని, ఈ రంగంలో ఆయుర్వేదం కీలక పాత్ర పోషించగలదన్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ చేస్తున్న కృషిని ఆమె ప్రశంసిస్తూ టీబీ వంటి వ్యాధులపై పోరాటంలో ప్రపంచ తీర్మానాల వైపు ఏఐఐఏ కొత్త శక్తిని ఇంజెక్ట్ చేస్తుందని అన్నారు.

టీబీ సమాచారం, నిర్వహణ మరియు నిర్ధారణ దిశలో చాలా కాలంగా ఇన్‌స్టిట్యూట్‌లో ప్రయత్నాలు జరుగుతున్నాయని మరియు ఇందులో చాలా విజయం సాధించడం గమనించదగ్గ విషయమని చెప్పారు. ఆయుర్వేదం మరియు అల్లోపతి రెండింటికీ సంబంధించిన ఈ వర్క్‌షాప్‌లో పెద్ద సంఖ్యలో నిపుణులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా టీబీ రహిత భారత్‌పై ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా నేషనల్ టిబి ఎలిమినేషన్ ప్రోగ్రామ్ (ఎన్‌టిఇపి) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రఘురామ్ రావు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఆయుష్) డైరెక్టరేట్, డీన్స్ డాక్టర్ రఘు అరకల్ మరియు ఇతర సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు కూడా పాల్గొన్నారు. ప్రొఫెసర్ జోనా మరియు డాక్టర్ కజారియా ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

అక్రమాలకు పాల్పడుతున్నారు అడ్డుకోండి: కెసిఆర్ ప్రభుత్వంపై ఈసికి కాంగ్రెస్ ఫిర్యాదు

హైదరాబాద్, డిసెంబర్ 2:ధరణి పోర్టల్‌లో అసైన్డ్ భూములను బీఆర్ఎస్ నేతలు తమ బినామీల పేర్ల మీదకు బదలాయింపు చేస్తోందని, అలాగే కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేస్తోందని అందువల్ల కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లింపులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఈసీకి ఫిర్యాదు చేశారు కాంగ్రెస్ నేతలు ?టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మధుయాష్కీ గౌడ్ తదితరులతో కూడిన కాంగ్రెస్ ప్రతినిధుల బృందం నేడు చీఫ్ ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ను కలిసింది.. రైతుబంధు కోసం సమకూర్చిన నిధులు బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కదారి మళ్లిస్తోందని ఈ నేతలు ఫిర్యాదు చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకూ కెసిఆర్ ప్రభుత్వం ఎటువంటి విధాన పరమైన నిర్ణయాలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఒక లేఖను ఈసీకి అందజేశారు..

కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన ఫేవర్ హాస్పిటల్ అర్ఎంఓ

హైదరాబాద్ డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); జాతీయ కాలుష్య నియ ంత్రణ దినోత్సవం '' ను పురస్కరిం చుకొని ఫేవర్ హాస్పిటల్ ప్రాంగ ణంలో ఆసుపత్రి అర్ఎంఓ జయల క్ష్మి, సామాజిక కార్యకర్త జ్యోతి రెడ్డి తదితరులతో కలిసి మొక్కలు నాటా రు. ఈ కార్యక్రమం లో ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ "జాతీయ అధ్యక్షులు రంగయ్య శాసం. పలువురు పర్యావరణ వాదులు పాలొన్నారు

మిత్రసాహితి, విశాఖపట్టణం నిర్వహణలో
1990 నుంచి ఉత్తమ కథలను పాఠకులకు అందిస్తున్న
కథాసాహితి సంకలనాల పరంపరలో 33వది
కథ 2022 ఆవిష్కరణ
3 డిసెంబర్ 2023
ఆదివారం ఉదయం
10 గంటలకు
వేదిక
పబ్లిక్ లైబ్రరీ
ద్వారకానగర్, విశాఖపట్టణం
సాగర తీరాన కథల జాతర...
ముఖ్య అతిథి - కె. శివారెడ్డి, ప్రముఖ కవి
స్వాగతం - విశాఖ వర్మ, మిత్రసాహితి
అధ్యక్షత - గంటేడ గౌరునాయుడు, ప్రముఖ రచయిత
ఆవిష్కరణ - నందిని సిధారెడ్డి, ప్రముఖ కవి
పుస్తక సమీక్ష - కొప్పర్తి, ప్రముఖ కవి
ఆత్మీయ అతిథులు - కన్నెగంటి చంద్ర, తానా ప్రచురణల కమిటీ చైర్ పర్సన్
ఎల్.ఆర్. స్వామి, ప్రముఖ రచయిత, అనువాద

ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా విశ్వ భారతి డిగ్రీ కళాశాల విద్యార్థుల భారీ ర్యాలీ

వికారాబాద్ డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: చికిత్స ద్వారా హెచ్ఐవి ని కొంతమేరకు నియంత్రించవచ్చని, ఎయిడ్స్ కు అవగాహనే సరైన మందు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. నేడు వికారాబాద్ లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వికారాబాద్ జిల్లా శాఖ మరియు సత్య సాయి సేవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా విశ్వ భారతి డిగ్రీ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆ సందర్భంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి మాట్లాడుతూ హెచ్ఐవి సోకిన వారు ఏమాత్రం అధైర్య పడకుండా జీవితము సాగించవచ్చని, దీని నివారణకు పరిశోధనలు పురోగతి ఉన్నప్పటికిని నేటికీ సురక్షితమైన, శక్తివంతమైన టీకా అందుబాటులోనికి రాలేదని, అవగాహనే దీనికి సరైన మందు అని సాయి చౌదరి అన్నారు.

ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి సోకే మార్గాలు తెలుసుకుని జాగ్రత్త పడటం ద్వారా ప్ర తి మనిషి తనను తాను కాపాడుకోవచ్చని, సురక్షితమైన లైంగిక సంపర్కము, కండోమ్ వాడకము ద్వారా దీనిని అడ్డుకోవచ్చని వికారాబాద్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమమునకు వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ సత్యనారాయణ గౌడ్, విశ్వ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, బసవరాజ్, కళాశాల సిబ్బంది మరియు కళాశాల విద్యార్థులు, రెడ్ క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత.. ర్యాలీలకు అనుమతి లేదు : ఎస్పీ రితిరాజ్

మహబూబ్‌నగర్, డిసెంబర్ 2:ఆదివారం శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల భద్రత నిర్వహిస్తున్నామని, సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాసనసభ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, జిల్లా ప్రజలు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా గైడ్లైన్స్ (క్రింది సూచనలు) పాటించి జిల్లా పోలీస్ వారికి సహకరించాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

పోలీస్ వారి సూచనలు..

ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు రేపు గద్వాల, ఆలంపూర్ నియోజకవర్గాల శాసన సభ ఎన్నికల కౌంటింగ్ జరిగే గోనుపాడు పాలిటెక్నిక్ కళాశాల అవరణంలో, పరిసర ప్రాంతంలో ప్రజలు ఎవరు కూడా గుమికూడి ఉండరాదు. ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. గెలుపొందిన అభ్యర్థులను ఆర్ఓ లు ప్రకటించిన తరువాత ధృవీకరణ పత్రం అందుకునేందుకు అభ్యర్థితో పాటు ఇద్దరికి మించి లోపలికి వెళ్లరాదన్నారు. అభ్యర్థుల విజయాలకు సంబంధించి ఎవరు కూడా ర్యాలీలు, ఊరేగింపులు చేయరాదన్నారు. అభ్యర్థుల ప్రకటనల అనంతరం ఆయా పార్టీల కార్యకర్తలు, ప్రజలు ఎవరు కూడా ఉద్రేకాలకు లోనై ఇతరుల మీదకు వెళ్లి గొడవలు సృష్టించినా, ఇతరులను భయ భ్రాంతులకు గురి చేసినా, ఆస్తులను ధ్వంసం చేసినా, ఓడిన అభ్యర్థులను కించపరిచేలా మాట్లాడినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా అలాంటి వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కావున ఎలక్షన్స్ కమిషన్ ఆఫ్ ఇండియా సూచించిన గైడ్ లైన్స్ ను ప్రజలు పాటించి పోలీస్ వారికి సహకరించాలని జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలకు సూచించారు.

మాటలకే పరిమితం అవుతున్న దివ్యాంగులు

(నేడు ప్రపంచ వికలాంగుల దినోత్సవ సందర్భంగా)

- సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి

హైదరాబాద్, డిసెంబర్ 2:సమాజానికి వారిని చూస్తే చిన్న చూపు వారిలోని వైకల్యాన్ని ఎత్తిచూపే పదాలతో కించపరుస్తూ పిలవడం తరచు గమనిస్తూ ఉంటామని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి అన్నారు. రోజురోజుకీ పరిణితి చెందుతున్న ఆధునిక ప్రపంచంలో వేదికల మీద సమానత్వము, న్యాయము అంటూ నొక్కి వక్కాణించే విద్యాధికులు, రాజకీయ పెద్దలు, హక్కులు, బాధ్యతలు మెరుగైన జీవన విధానాల గురించి పదేపదే మాట్లాడుతూ ఉంటారని అవి దివ్యాంగుల విషయంలో కేవలం మాటలకే పరిమితం అవుతూ చిన్న చూపు వ్యక్తమవుతున్నదని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి తన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారము ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ కు మించి ఏదో ఒక విధంగా వైకల్యంతో బాధపడుతున్న వారున్నారని అందులో మనదేశంలో ఉన్న నాలుగు నుండి ఆరు కోట్ల మంది దివ్యాంగులు , 30 ఏళ్లలోపు వారున్నారని వీరులో 70% గ్రామీణ ప్రాంతాలలో సరైన వసతులు, ఉద్యోగాలు, ఉపాధి లేక ఇబ్బందులు, అవస్థలు పడుతున్నారని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్నదివ్యాంగులను గుర్తించడం, వారి అవసరాలను తీర్చడం, హక్కులకు భద్రత కల్పించడం, వారిలో స్ఫూర్తినింపటం, సంఘటిత పరచడం, గౌరవంగా జీవించే ఉపాధి పనులు కల్పించడం, వారికి సాంఘిక, ఆర్థిక , సాంస్కృతిక, రాజకీయ జీవితాన్ని అందించడం వంటి ఎన్నో అంశాల మీద అవగాహన కల్పించే రోజుగా ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం" డిసెంబర్ 3వ తేదీన ప్రపంచ వికలాంగుల దినోత్సవం'' గా ప్రకటించిందని తెలిపారు. 1983 నుంచి 1992 మధ్య పదిసంవత్సరాల కాలాన్ని అంతర్జాతీయ వికలాంగుల దశాబ్దంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని, ఆ కాలంలో ప్రభుత్వాలు ప్రైవేట్ సంస్థలు వికలాంగుల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలని అమలుపరిచే విధంగా దేశాన్ని దిశా నిర్దేశం చేసిందని తెలిపారు.

దివ్యాంగులు, చెవిటి, మూగ అందత్వం ఉన్నవాళ్లు చేతుల కదలికలే భావాలని పలికిస్తాయని, మనసు భాషను ఆకర్షిస్తాయని, కష్టము, సుఖము ఏ ఒక్కరితోనో మనస్ఫూర్తిగా పంచుకోలేని అవస్థ వాళ్ళదని తాము పడుతున్న అవస్థలు, కష్టాలు, నోరార పక్కవారితో పంచుకోలేని దీనావస్థ వారిదని లిల్లీ మేరి తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఒకవైపు పేదరికం, మరోవైపు వైకల్యము మన దేశం ఏ గ్రామంలో చూసినా దివ్యాంగులు కనిపిస్తూ ఉంటారని, రైల్వే, బస్ స్టేషన్లు, గుళ్ళ ముందు, సిగ్నల్ దగ్గర ఎక్కడ చూసినా వీరే ఉంటారని, యాచకత్వం వీరికి తెలిసిన ఒకే ఒక మార్గంగా జీవించే వారందరో, శారీరక వైకల్యంతో మానసికంగా అనుక్షణం కృంగిపోతూ మానసిక వైకల్యంతోను బాధపడుతున్న వారెంతో మంది ఉన్నారని లిల్లీ మేరి అన్నారు. అయితే వైకల్యం అవరోధం కానే కాదంటూ సకలాంగుల కంటే, దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరంటూ నిరూపించిన, నిరూపిస్తున్న ఎంతోమంది స్ఫూర్తి పదాతలు ఉన్నారని లిల్లీ మేరి తెలిపారు.

దేన్నైనా సాధించగలను. జయించగలను. అవరోధాన్ని అధిగమించగలను. వంటి ఇతర సంకల్పం ఉన్న వారి ముందు ఎటువంటి ఆటంకమైన అడ్డు తప్పుకుంటుందని, మన సంకల్పం ముందు, శారీర వైకల్యం అవరోధం కానే కాదని, సంకల్ప సిద్ధి, మనోధైర్యం విజయానికి అసలైన సాధనాలని ఎంతోమంది ఎన్నో రకాల వైఫల్యాలను అధిగమించి నిరూపించారని ... నిరూపిస్తూనే ఉన్నారని తెలిపారు.

రెండు చేతులు లేని వ్యక్తి నోటితో పెయింటింగ్స్ వేయడం అంత శ్రీ సంగీత విదుషి అని అవడం మనీ అవడం కాల్ లేని వ్యక్తులు చిన్న చిన్న షాపులు పెట్టుకుని జీవించడం కాళ్లతో పెన్ను పట్టుకుని పరీక్షలు రాసి పట్టాలు పుచ్చుకుంటున్న విద్యార్థులు ఇలా ఎంతోమంది తమ వైకల్యాలను వీరు కూడా కనిపెట్టి సక్సెస్ఫుల్గా గౌరవంగా బతుకుతున్నారని లిల్లీ మేరీ తెలిపారు. కాలు లేకపోయినా ఆత్మవిశ్వాసంతో నాట్యం చేసి వైకల్యాన్ని జయించిన నాట్య మయూరుల్ని, పెన్సిల్, పెన్ అమ్ముకుంటూ ఆత్మస్థైర్యంతో గౌరవంగా జీవిస్తున్న అంద సోదరులని ఇలా అన్ని రంగాలలో "మేము సైతం" అంటూ స్ఫూర్తినిస్తున్నారని ఆమె తెలిపారు. దివ్యాంగులే స్ఫూర్తిగా ప్రదాతలుగా గౌరవంగా జీవిస్తున్నప్పుడు సకలాంగులుగా ఉండి, అందమైన జీవితాన్ని భయము, సోమరితనము, మనో వైకల్యాలు, వికారాలు, అలవాట్లకు బానిసలై ఆత్మ న్యూ నాతతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేటి యువతకి విజయాలు సాధిస్తున్న వికలాంగుల జీవితం ఆదర్శనీయమని తెలిపారు ఆదర్శం ... ఆచరణీయ మన్నారు. ఉన్నత స్థితి నుండి ఉత్తమమైన స్థితికి ఎదగాలంటే ప్రయత్నం వైపు మనసు మళ్లించడానికి దృఢ చిత్తం అలవర్చుకోవాలని, అలాంటి దృఢచితులకే మార్గాన్వేషణ సులభం అవుతుందని, దేన్నైనా సాధించగలమని ఆత్మవిశ్వాసమే సృజనాత్మకతను వెలికితీస్తుందని, ఎటువంటి వైకల్యమైన దృఢ సంకల్పం ముందు దాసోహమే అని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి అన్నారు. అన్ని అంగాలు ఉన్న వాళ్ళు సాధించలేని విజయాలు సాధించిన వికలాంగుల్లో 'నిక్ యుజెసస్' జీవితం దివ్యాంగులకే కాదు సకలాంగులకి సదాస్ఫూర్తిదాయకమని ప్రిన్సిపల్ లిల్లీ మేరి తెలిపారు. వెయ్యి సార్లు విఫలమైనా, మరోసారి ప్రయత్నించు., ప్రయత్నం ఎలాంటి వైకల్యాన్నైనా అధిగమించేలా చేస్తుందని వివేకానందుని సూక్తి దివ్యాంగులకు మనోధైర్యం ఇస్తుందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి తెలిపారు.

సాయుధ దళాల వైద్య కళాశాల, పూణేలో టెలి-మానస్ సెల్ స్థాపించబడింది

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మద్దతుతో పూణేలోని ఆర్మ్డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీలో ప్రత్యేక టెలి-మానస్ సెల్ ఏర్పాటు చేయబడింది. ఈ సెల్‌ను ఈరోజు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, పీ వీ ఎస్ ఎం, యూ వై ఎస్ ఎం, ఏ వీ ఎస్ ఎం, ఎస్ ఎం, వీ ఎస్ ఎం ప్రారంభించారు. ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆర్థిక సలహాదారు శ్రీమతి ఇంద్రాణి కౌశల్ మరియు నిమ్హాన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమా మూర్తి కూడా పాల్గొన్నారు. ఈ సెల్ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ యొక్క టెలీ మెంటల్ హెల్త్ అసిస్టెన్స్ అండ్ నెట్ వర్కింగ్ అక్రాస్ స్టేట్స్ (టెలి మనస్) యొక్క అనుబంధ సంస్థ గా పనిచేస్తుంది. నేషనల్ టెలీ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా, టెలీ మెంటల్ హెల్త్ అసిస్టెన్స్ అండ్ నెట్‌వర్కింగ్ అక్రాస్ స్టేట్స్ (టెలి మనస్)ని కేంద్ర ఆర్థిక మంత్రి 2022 కేంద్ర బడ్జెట్‌లో 1 ఫిబ్రవరి, 2022న ప్రకటించారు మరియు డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ (డి ఎం హెచ్ పీ)యొక్క డిజిటల్ విభాగంగా 10 అక్టోబర్, 2022న నిమ్హాన్స్‌లో జరిగిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ వేడుకలో కర్ణాటక గవర్నర్ ప్రారంభించారు. 14416 టోల్-ఫ్రీ నెంబర్ ద్వారా ప్రతి రాష్ట్రం మరియు యూ టీ లో 24 లీ 7 టెలి మెంటల్ హెల్త్ సదుపాయాన్ని సమగ్రంగా మరియు సమ్మిళితం గా పనిచేయాలని టెలీ-మానస్ భావిస్తోంది.

భారత సైన్యం ఎదుర్కొంటున్న ప్రత్యేక ఒత్తిళ్లను గుర్తించి సాయుధ బలగాల లబ్ధిదారులకు సమగ్ర ఆరోగ్య సంరక్షణను అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. కార్యరంగ వాతావరణం, సాంస్కృతిక సవాళ్లు మరియు ప్రాంతీయ సంఘర్షణల నిర్దిష్ట ఒత్తిళ్లతో పని చేసే సాయుధ దళాలలో మానసిక ఆరోగ్య సంరక్షణ సేవలకు ప్రత్యేక విధానం అవసరం. సాయుధ దళాలలోని సేవా సిబ్బంది మరియు వారి కుటుంబాల మానసిక ఆరోగ్యం మరియు శ్రేయస్సుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం స్పష్టంగా ప్రభుత్వం గుర్తించింది. సాయుధ దళాల సిబ్బంది మానసిక సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ టెలి మనస్ సెల్ ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించాలని నిర్ణయించింది.

ప్రస్తుతం నేషనల్ టెలీ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా కింద, 34 రాష్ట్రాలు/యూటీల ద్వారా 46 ఫంక్షనల్ టెలి మనస్ సెల్‌లు 20 విభిన్న భాషల్లో సేవలు అందుబాటులో ఉన్నాయి. టెలి మనస్ హెల్ప్‌లైన్ అక్టోబర్ 2022లో ప్రారంభించినప్పటి నుండి 4 లక్షల 70 వేల కంటే ఎక్కువ కాల్‌లను స్వీకరించింది మరియు ఒక రోజులో 2000 కంటే ఎక్కువ కాల్‌లను నిర్వహిస్తోంది.

కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించాలి-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కరీంనగర్, డిసెంబర్ 2:అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించే విధంగా సన్నద్ధం కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం రామగిరిలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత కౌంటింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ కౌంటింగ్ పరిశీలకులు రామగుండం రాజేష్ సింగ్ రానా, మంథని సి.పి.పటేల్, పెద్దపల్లి సీ.ఎన్ శ్రీధర లతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ డిసెంబర్ 3న ఉదయం 8 గంటలకు జేఎన్టీయు కళాశాల బ్లాక్ 2 నందు జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందన్నారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ హాల్లో 14 కౌంటింగ్ టేబుల్, ఒక పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ ,మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3 రిజర్వ్ బృందాలు, 3 పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ సమయంలో ఫారం 13ఏ ఎట్టి పరిస్థితుల్లో బయటికి రావద్దని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ నిబంధనల ప్రకారం చివరి రౌండ్ లెక్కింపు ప్రారంభానికి ముందు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్ కు ముందస్తుగా కంట్రోల్ యూనిట్ లను హమాలీలు తీసుకుని వస్తారని, ప్రతి 2 టేబుళ్ళకు ఒక హమాలీ ఉంటారని, వారికి డ్రెస్ కోడ్ ఉంటుందని, ప్రతి టేబుల్ వద్ద వారికి కేటాయించిన కంట్రోల్ యూనిట్లు మాత్రమే చెక్ చేసి కౌంటింగ్ చేయాలన్నారు. కంట్రోల్ యూనిట్ లెక్కింపు ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్ లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17సి నందు నమోదైన ఓట్లు సరిచూసుకోవాలని, తేడా వస్తే వెంటనే సదరు కంట్రోల్ యూనిట్ ను రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కంట్రోల్ యూనిట్ లో క్లాక్ ఎర్రర్ వస్తే కొత్త బ్యాటరీ వేసి ఆన్ చేయాలని, అప్పటికి క్లాక్ ఎర్రర్ వస్తే రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని, కంట్రోల్ యూనిట్ లో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా.. వెంటనే రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలన్నారు. కంట్రోల్ యూనిట్ లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17సి నందు నమోదైన ఓట్లు ట్యాలీ చేసుకోని రిజల్ట్ బటన్ ప్రెస్ చేయాలని, కౌంటింగ్ ఏజెంట్లకు ఫలితాలు చూపించి వాటిని నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలని, 14 టేబుల్ వద్ద కౌంటింగ్ పూర్తయిన తర్వాత, ఆ రౌండ్ వివరాలు రిటర్నింగ్ అధికారి వెల్లడించిన తర్వాత మాత్రమే తదుపరి రౌండ్ కౌంటింగ్ ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వీవీ ప్యాట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది, వీవీ ప్యాట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కౌంటింగ్ నిర్వహించే సమయంలో అధికారులు, సిబ్బంది నిబంధనలను గుర్తించుకోవా లని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని, కౌంటింగ్ హాల్లో అధికారులు, సిబ్బంది మౌనంగా ఉండాలని, ప్రశాంతంగా వ్యవహరించాలని, ఎటువంటి సంద ర్భం ఎదురైనప్పటికీ ప్రశాంతంగా లెక్కింపు ప్రక్రియ పక ద్బందీగా నమోదయ్యేలా చూసుకోవా లని, గందరగోళానికి గురి కావద్దన్నారు.

వీవీ ప్యాట్ స్లిప్పుల లెక్కింపు అప్రమత్తంగా చేయాలని, అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆ స్లిప్పులను బ్లాక్ కవర్ లలో భద్రపర్చి సీల్ చేయాలని, ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ చేయాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎవరికి సెల్ ఫోన్ అనుమతి లేదని, కౌంటింగ్ కేంద్రం వద్ద అవసరమైన తనిఖీ నిర్వహించేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ పరిశీలకులు రాజేష్ సింగ్ రానా మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో కంట్రోల్ యూనిట్ లో ఎటువంటి ఎర్రర్ వచ్చిన వెంటనే అధికారి దృష్టికి తీసుకుని రావాలన్నారు. కౌంటింగ్ కేంద్రానికి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకుని రావాలని, కౌంటింగ్ కేంద్రం లోపల ఎవరికి సెల్ ఫోన్ అనుమతి లేదని, కౌంటింగ్ ఏజెంట్లతో ఎటువంటి సంభాషణలు పెట్టుకోవద్దని, ప్రశాంతంగా వ్యవహరించాలని ఎట్టి పరిస్థితుల్లో ఆగ్రహానికి గురి కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం రిటర్నింగ్ అధికారి జే.అరుణశ్రీ, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్యామ్ ప్రసాద్ లాల్, పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి సి.హెచ్. మధుమోహన్, మంథని రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్, మంథని ఆర్డీఓ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారి తూము రవీందర్, కౌంటింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై భారతదేశ ప్రమాణాలను కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్ ప్రశంస

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:188 సభ్య దేశాల ఐక్యరాజ్యసమితి కి చెందిన డబ్ల్యూ హెచ్ ఓ మరియు ఎఫ్ ఏ ఓ రూపొందించిన అంతర్జాతీయ ఆహార భద్రత మరియు నాణ్యతా ప్రమాణాల నిర్దేశిత సంస్థ అయిన కోడెక్స్ అలిమెంటరియస్ కమిషన్, చిరుధాన్యాలులపై భారత దేశం యొక్క ప్రమాణాలను ప్రశం సించింది మరియు ఇటలీలోని రోమ్ లో జరిగిన దాని 46వ సెషన్‌లో చి రుధాన్యాలు కోసం ప్రపంచ ప్రమా ణాల అభివృద్ధికి భారతదేశం ప్రతిపా దనను ఆమోదించింది. భారతదేశం 8 నాణ్యత పారామి తులను పేర్కొంటూ 15 రకాల చిరు ధాన్యాలుల కోసం సమగ్ర సమూహ ప్రమాణాన్ని రూపొందించింది, ఇది అంతర్జాతీయ సమావేశంలో అద్భుత మైన ప్రశంసలను అందుకుంది. కోడెక్స్ ప్రస్తుతం జొన్న మరియు పెర్ల్ మిల్లెట్ ప్రమాణాలను కలిగి ఉంది.

చిరుధాన్యాలకు సంబంధించిన ప్రపంచ ప్రమాణాల అభివృద్ధి కోసం భారతదేశం ఒక ప్రతిపాదనను ముందుకు తెచ్చింది, ప్రత్యేకించి ఫింగర్ మిల్లెట్, బార్న్యార్డ్ మిల్లెట్, కోడో మిల్లెట్, ప్రోసో మిల్లెట్ మరియు లిటిల్ మిల్లెట్‌లను పప్పుధాన్యాల విషయంలో సమూహ ప్రమాణాలుగా పేర్కొంది. రోమ్‌లోని ఎఫ్ ఏ ఓ ప్రధాన కార్యాలయంలో జరిగిన సెషన్‌లో ఈ ప్రతిపాదన ఏకగ్రీవంగా ఆమోదించబడింది, దీనికి యూరోపియన్ యూనియన్ తో సహా 161 సభ్య దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు.

2023ని అంతర్జాతీయ చిరుధాన్యాలు సంవత్సరంగా జరుపుకునే ఈ మహత్తర సందర్భంలో కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా భారత ప్రతినిధి బృందాన్ని అభినందించారు. సామాన్యులు చిరుధాన్యాలు ఎంపికలో భారతదేశం కీలక పాత్ర పోషించిందని ఆయన అన్నారు. భారతదేశ ప్రతిపాదన ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాలు మరియు దాని ప్రయోజనాలను హైలైట్ చేయడంలో నూతన ప్రమాణాలను సీఈఓ, ఎఫ్ ఎస్ఎస్ఏఐ శ్రీ జి కమల వర్ధనరావు నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం 2023ని "అంతర్జా తీయ చిరుధాన్యాల సంవత్సరం"గా ప్రకటించడమే కాకుండా ఈ ఉత్పత్తులలో పెరుగుతున్న అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రతిబింబిస్తూ చిరుధా న్యాలులకు అంతర్జాతీయ సమూహ ప్రమాణాలను ప్రతిపాదించింది.

సీఈఓ, ఎఫ్ఎస్ఎస్ఏఐ శ్రీ జి కమల వర్ధనరావు, చిరుధాన్యాలు ప్రమాణాలపై పుస్తకాన్ని కోడెక్స్ ఛైర్మన్ స్టీవ్ వేర్న్‌కు అందజేశారు.

సీ ఏ సీ ప్రతిపాదనను ఆమోదించడంతో, ప్రాజెక్ట్ పత్రాల సమర్పణ మరియు ప్రతిపాదిత ప్రమాణాల ప్రతి అభివృద్ధిపై పని ఇప్పుడు భారతదేశం ప్రారంభిస్తుంది. 15 రకాల మిల్లెట్‌ల కోసం ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ రూపొందించిన మిల్లెట్‌ల సమూహ ప్రమాణాలు తేమ శాతం, యూరిక్ యాసిడ్ , అదనపు పదార్థం, ఇతర తినదగిన ధాన్యాలు, లోపాలు, కలుపు ధాన్యాలు మరియు అపరిపక్వ మరియు ముడుచుకున్న ధాన్యాల గరిష్ట పరిమితులు వంటి 8 నాణ్యత పారామితులను ప్రపంచ ప్రమాణాల అభివృద్ధికి ఒక ముఖ్యమైన పునాదిగా పేర్కొంటాయి. జొన్న మరియు పెర్ల్ మిల్లెట్ కోసం ప్రస్తుతం ఉన్న కోడెక్స్ ప్రమాణాలు కూడా సమీక్షించబడతాయి, అలాగే మిల్లెట్ల కోసం సమూహ ప్రమాణాలను రూపొందించడం జరుగుతుంది.

ప్రస్తుత సెషన్ కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్ యొక్క 60వ వార్షికోత్సవాన్ని సూచిస్తుంది, దీనిలో భారతదేశం 1964 నుండి సభ్యునిగా ఉంది. భారతదేశం ఇప్పటివరకు 12 ఈ డబ్ల్యూ జీ లకు అధ్యక్షత వహించింది మరియు వివిధ కోడెక్స్ ప్రమాణాలు/టెక్స్ట్‌లు మరియు మార్గదర్శకాలకు సంబంధించిన 28 ఈ డబ్ల్యూ జీలకు సహ-అధ్యక్షునిగా ఉంది. భారతదేశం ప్రతిపాదించిన ముఖ్యమైన ప్రమాణాలలో స్టాండర్డ్ ఫర్ ఓక్రా, బీ డబ్ల్యూ జీ మిరియాలు, వంకాయలు, ఎండిన మరియు నిర్జలీకరణ వెల్లుల్లి, ఎండిన మిరపకాయ మరియు నిర్జలీకరణ మిరపకాయలు, తాజా ఖర్జూరాలు, మామిడి చట్నీ, చిల్లీ సాస్, వేర్ పొటాటోలు మరియు నాన్-రిటైల్ కంటైనర్‌ల కోసం లేబులింగ్ అవసరాలు ఉన్నాయి.

రిటైర్డ్ న్యాయమూర్తుల చేతుల్లో ఆర్బిట్రేషన్ వ్యవస్థ : ఉప రాష్ట్రపతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: దేశ ఆర్బిట్రేషన్ వ్యవస్థ రిటైర్డ్ న్యాయమూర్తుల చేతుల్లో ఉందని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్ అన్నారు. ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేశారు. అర్హులైన ఇతరులకు అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఇప్పుడు మనం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చిందని, అవసరమైన మార్పులు చేయాలన్నారు. అవసరమైతే చట్టాలను సైతం మార్పు చేయాలన్నారు. దేశంలో ఉన

వాయు కాలుష్యం అధికంగా ఉన్న జిల్లా వికారాబాద్

-సామాజిక కార్యకర్త సాయి చౌదరి తాడికొండ

హైదరాబాద్, డిసెంబర్ 2:భూమిపై గల భౌతిక వ్యవస్థలతో పాటు కోట్లాది జీవరాశుల మనుగడకు నష్టం వాటిల్లే విధముగా కలుషితాలను పర్యావరణంలోకి విడుదల చేయడాని కాలుష్యం అని అంటారు. కాలుష్యం అనేది చాలా రకాలుగా ఉంటుంది. నీటి కాలుష్యం, నేల కాలుష్యం, వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం ... ఇవి అనాదిగా మానవుడు ఎదుర్కొంటున్న పర్యావరణ కాలుష్యం లోని రకాలు. అయితే శాస్త్ర, సాంకేతిక రంగాలలో మానవుడు సాధించిన విశేష ప్రగతి కారణంగా అనేక కొత్త రకాలైన కాలుష్యాలు వచ్చాయి. రేడియో ధార్మిక కాలుష్యం, ఉష్ణకాలుష్యం. ఇలా కాంతి కాలుష్యం లాంటివి ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. గత కొన్ని కొన్నేళ్లలో గణనీయంగా పెరిగిన కాలుష్య ప్రభావం జీవరాసుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుస్తుందని తెలిపారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. నేడు 'జాతీయ కాలుష్య నివారణ దినోత్సవ' సందర్భంగా ప్రముఖ సామాజిక కార్యకర్త సాయి చౌదరి తాడికొండ అందిస్తున్న ప్రత్యేక కథనం.

వివిధ రకాల కాలుష్యాలు – వాటి గల కారకాలు :1. వాయు కాలుష్యం: వాతావరణం లోకి రసాయనాలు, పరిమాణవులను విడుదల చేయటం వల్ల ఈ తరహా కాలుష్యం ఏర్పడుతుంది ఇటీవల కాలంలో కర్మాగారాల వల్ల వాయు కాలుష్యం గా పెరిగింది. 2. నీటి కాలుష్యం: వ్యర్థ పదార్థాలను, కలుషితాలను, మురుగు నీటి వ్యవస్థల ద్వారా నదులు, చెరువుల్లోకి పంపటం మూలంగా జల కాలుష్యం ఏర్పడుతుంది. 3. నేల కాలుష్యం: హైడ్రో కార్బన్లు, ఖనిజాలు, కలుపు నివారణ మందులు, క్రిమిసంహారకాలు తదితర రసాయన పదార్థాల వల్ల భూమి కాలుష్యం తలెత్తుతుంది. 4. రేడియోధార్మిక కాలుష్యం: అన్వస్త్రాల తయారీ పరిశోధనలు తదితర చర్యల వల్ల ఇటీవల కాలంలో రేడియోధార్మిక కాలుష్యం చాలా ఎక్కువ అయింది. 5. వాహనాలు, పరిశ్రమలు తదితర కారణాల వల్ల వెలువడే అధిక పౌనపున్యం గల ధ్వని తరంగాలతో ధ్వని కాలుష్యం తలెత్తుతుంది.

కాలుష్య కారకాలు: కాలుష్య కారకం అంటే గాలి, నీరు, మట్టిని కలుషితం చేసే ఒక వ్యర్థ పదార్థం. కాలుష్య కారకం యొక్క తీవ్రతను మూడు విషయాలు నిర్దేశిస్తాయి. అవి రసాయనిక స్వభావము, గాఢత, మొండితనం.

కాలుష్యంలో వికారాబాద్ జిల్లా : కాలుష్యంలో వికారాబాద్ జిల్లా ప్రపంచంలోనే పేరుగాంచింది. జిల్లా పరిధిలోని తాండూరు పట్టణం దేశ రాజధాని ఢిల్లీని పక్కన పెట్టి మొదటి స్థానాన్ని ఆక్రమించిందంటే ఈ ప్రాంతంలో కాలుష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక ప్రకారం తాండూరులో ప్రతి క్యూబిక్ మీటర్ గాలిలో 622 మిల్లీగ్రాములు కాలుష్యం ఉన్నట్లుగా తేలింది . జాతీయ వాయు ప్రమాణాల సూచిక ప్రకారం సాధారణంగా 100 మిల్లీగ్రాములు కాలుష్యం ఉంటే ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఉండదు. అంతకంటే ఎక్కువ ఉంటే మాత్రం ప్రజల ఆరోగ్యానికి తీరని నష్టం వాటిల్లుతుంది. కానీ తాండూరులో దానికి 6 రెట్లు ఎక్కువ పరిమాణంలో కాలుష్యం ఉంది. ఈ పట్టణ పరిసరాలతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో సుమారు 1000 కి పైగా పాలిషింగ్ యూనిట్లు, ఐదు సిమెంట్ కర్మాగారాలు, నాపరాయి క్వారీలు, శుద్ధ గనులు, లాటరైట్ గనులు ఉండటం వల్ల పర్యావరణం విషతుల్యంగా మారింది. ఈ కారణం వల్ల 2016లో అత్యంత జనసాంద్రత గల కలిగిన దేశ రాజధాని ఢిల్లీ కన్నా తాండూరులో కాలుష్యం ఎక్కువగా నమోదయింది. అయితే అంతకు రెండింతల కాలుష్యం తాండూరులో నమోదు కావడం ఈ ప్రాంత ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. అయితే ఇక్కడ కాలుష్యం నియంత్రణ చర్యలకు తీసుకున్న చర్యలు మాత్రం అంతంత మాత్రం గానే కనబడుతున్నాయి.

తాండూరులో కాలుష్యంపై ఎన్జీటీలో ఫిర్యాదు: తాండూర్ లో వాయు కాలుష్యం పై పట్టణానికి చెందిన ఉద్యమకారుడు రాజగోపాల్ గతంలోనే జాతీయ హరిత ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేస్తూ పిల్ కూడా దాఖలు చేశారు. ఐపీసీ సెక్షన్లు 268, 269, 270,,278 511 ప్రకారం ఆయన కోర్టులో వాజ్యము దాఖలు చేశారు. దీన్నిబట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అసంపూర్తి రోడ్డు పనులతో విపరీతంగా పెరిగిన వాయు కాలుష్యం: వికారాబాద్ జిల్లాలో కాంట్రాక్టర్ రోడ్డు ను తవ్వి కంకర, మట్టి వేసి వదిలి వేయడంతో వాహనాల రాకపోకల సమయంలో విపరీతంగా దుమ్ములేస్తూ ఈ ప్రాంతమంతా విపరీతమైన వాలు వాయు కాలుష్యం నెలకొంది. దీంతో ఈ రూట్లో బస్సులు, ఇతర వాహనాల్లో ప్రయాణం చేసేవారు దుమ్ము, ధూళితో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో పాలవుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం అని వీటితోపాటు చాలా గ్రామాలకు కొత్తగా వేసిన రోడ్లు సకాలంలో పూర్తి కాకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు వాయు కాలుష్యంతో రోగాల పాలవుతున్నారని ప్రముఖ సామాజిక కార్యకర్త సాయి చౌదరి తాడికొండ తెలిపారు.

కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన- జిల్లా ఎన్నికల అధికారి/ కలెక్టర్, రాజర్షి షా

మెదక్, డిసెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): సీ.సీ కెమెరాల ద్వారా అనుక్షణం పర్యవేక్షణ సాయుధ బలగాల పహారా. 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు. రెండు నియోజకవర్గాల పరిధిలో ప్రశాంత వాతావరణం నడుమ సాఫీగా పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ,ఓట్ల లెక్కింపు కేంద్రాల లో ని స్ట్రాంగ్ రూమ్ లో భద్రప్రరిచామని జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ రాజర్షి షా. హావేలి ఘనపూర్ మండలం, స్థానిక జఖఖీ కళాశాల లో జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు.కౌంటింగ్ ప్రక్రియ , మెదక్ – 34 నియోజక వర్గంలో 274 పోలింగ్ కేంద్రాలు,14 టేబుల్స్, 20 రౌండ్స్ , 37 నర్సాపూర్ నియోజక వర్గంలో, 305 పోలింగ్ కేంద్రాలు, 14 టేబుల్స్ ,ఇఎ+2 పోస్టల్, తో దాదాపు 22 రౌండ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా సెగ్మెంట్ల నుండి ఓట్ల లెక్కింపు కేంద్రమైన, వై పి ఆర్ కళాశాలకు, ఈవీఎం లను తరలించి, జాగ్రత్తగా సరిచూసుకుని, స్ట్రాంగ్ రూంలలోకి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా క్రమపద్ధతిలో అమర్చామని అన్నారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు . ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి పరినరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీ.సీ కెమెరాల ను అమర్చి, మానిటర్ ద్వారా పర్యవేక్షణ జరిపిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుండి సోమవారం ఉదయం 6.00 గంటల వరకు 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులోకి ఉంటుందని తెలిపారు.ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో కి ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు. పై అన్ని ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు . స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లను నిశితంగా పరిశీలన చేశారు . ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఖీ రాజేశ్వర్,ఎన్నికల అధికారులు, ఎన్నికల సిబ్బంది వున్నారు.జిల్లా పౌర సంబంధాల అధికారి గారిచే జారీ చేయనైనది

2.0ను విజయవంతంగా ముగించినందుకు అభినందించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:2023 నవంబర్ 1 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్ 2.0ను విజయవంతంగా నిర్వహించినందుకు పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖను కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అభినందించారు. పెన్షనర్ల డిజిటల్ సాధికారత కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విజన్ ను అమలు చేయడానికి డిఎల్ సి క్యాంపెయిన్ 2.0 నిర్వహించినట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పెన్షనర్ల జీవన సౌలభ్యం కోసం డి ఎల్ సి క్యాంపెయిన్ 2.0 ఒక ముఖ్యమైన అడుగు అని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా డి ఎల్ సి క్యాంపెయిన్ 2.0 2023 నవంబర్ 1 నుంచి 30 వరకు 100 నగరాల్లోని 597 ప్రదేశాలలో జరిగింది. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు 38.47 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు 16.15 లక్షలు, ఇ పి ఎఫ్ ఒ పెన్షనర్లకు 50.91 లక్షలు కలిపి మొత్తం 1.15 కోట్ల డీఎల్ సి లు వచ్చాయి.

పెన్షన్ పంపిణీ బ్యాంకులు, మంత్రిత్వ శాఖలు/ విభాగాలు, పెన్షనర్ల సంక్షేమ సంఘాలు, యుఐడిఎఐ, ఎంఇఐటివై సహకారంతో పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ 2023 నవంబర్ ఒకటి నుండి 30 వరకు భారతదేశంలోని 100 నగరాల్లోని 597 ప్రదేశాలలో డిఎల్ సి నిర్వహించింది. భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/ విభాగాలు, పెన్షన్ పంపిణీ బ్యాంకులు, పెన్షనర్ల సంఘాలతో సహా భాగస్వాములందరి పాత్రలు, బాధ్యతలను నిర్వచించే వివరణాత్మక మార్గదర్శకాలు జారీ చేశారు. పింఛన్ల పంపిణీ బ్యాంకులకు చెందిన 297 మంది నోడల్ అధికారులు, 44 పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్లు డి ఎల్ సి క్యాంపెయిన్ 2.0కు నాయకత్వం వహించాయి. డిఎల్ సి నిరీక్షణ సమయాన్ని గణనీయంగా తగ్గించడానికి ఫేస్ ఆథెంటికేషన్ టెక్నాలజీ ని విస్తృతంగా ఉపయోగించారు. డి ఎల్ సి క్యాంపెయిన్ 2.0 కు ప్రింట్ , విజువల్ మీడియా ద్వారా, పి ఐ బి, డి డి న్యూస్ ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించారు.

డిఎల్ సి క్యాంపెయిన్ కు కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు విస్తృతంగా స్పందించారు. 38 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు డీఎల్ సి లు సృష్టించగా, అందులో ఫేస్ డిఎల్ సి ల సంఖ్య 9.60 లక్షలు. 35 లక్షల మందికి పైగా డిఫెన్స్ పెన్షనర్లు తమ పదవీ విరమణ నెలలో లైఫ్ సర్టిఫికేట్ సమర్పించవచ్చు కాబట్టి డిఎల్ సి సమర్పణ కొనసాగుతున్న చర్య. 2024 మార్చి నాటికి మొత్తం డిఎల్ సి సమర్పణ 50 లక్షల మార్కును దాటుతుందని అంచనా.

వయసుల వారీగా డిఎల్ సి ల జనరేషన్ ను విశ్లేషిస్తే 90 ఏళ్లు పైబడిన 24 వేల మందికి పైగా పెన్షనర్లు డిజిటల్ మోడ్ ను ఉపయోగించినట్లు వెల్లడైంది. డిఎల్ సి జనరేషన్ లో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ వరుసగా 5.07 లక్షలు, 4.55 లక్షలు, 2.65 లక్షల డిఎల్ సి లను సృష్టించాయి. డిఎల్ సి జనరేషన్ కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, వరుసగా 7.68 , 2.38 డిఎల్ సి లతో ప్రముఖ పంపిణీ బ్యాంకులుగా నిలిచాయి.

లైఫ్ సర్టిఫికెట్ సమర్పణ కోసం డిజిటల్ పద్ధతులను ఉపయోగించడం వల్ల ప్రయోజనాన్ని దేశంలోని అన్ని ప్రాంతాలలోని పెన్షనర్లకు చేరేలా చూడటానికి, ఢిల్లీ, విశాఖపట్నం, గౌహతి, పాట్నా, రాయ పూర్, గోవా, అహ్మదాబాద్, సిమ్లా, రాంచీ, బెంగళూరు, తిరువనంతపురం, భోపాల్, ముంబై, భువనేశ్వర్, లుధియానా, అజ్మీర్ , గ్యాంగ్ టక్, చెన్నై, హైదరాబాద్, త్రిపుర, లక్నో, డెహ్రాడూన్ తో సహా అనేక ప్రదేశాలలో శిబిరాలు నిర్వహించిన 100 నగరాలలో రాష్ట్ర రాజధానులు , ప్రధాన నగరాలు ఉన్నాయి. పెన్షనర్లకు సాంకేతికంగా సాధికారత కల్పించడంతో పాటు వారి డిఎల్ సి ల సృష్టి తో పాటు భవిష్యత్ అవసరాల కోసం ఈ ప్రక్రియను వారికి వివరించారు.

పెన్షన్ చెల్లింపు బ్యాంకులు, పెన్షనర్ల సంక్షేమ సంఘాలు నిర్వహించిన శిబిరాల్లో, వృద్ధులు/ అనారోగ్యంతో ఉన్న పెన్షనర్లకు సహాయం చేయడానికి ఇళ్లు/ ఆసుపత్రులను సందర్శించినప్పుడు, పెన్షనర్లకు వారి సంతృప్తి, సౌకర్యాన్ని వివరిస్తూ అనేక విజయగాథలు వెపెన్షనర్ల జీవన సౌలభ్యం కోసం పెన్షన్ అండ్ పెన్షనర్స్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ చేపట్టిన కార్యక్రమాల్లో దేశవ్యాప్త డిఎల్ సి క్యాంపెయిన్ 2.0 మరో మైలురాయి.

59వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హోమ్ మరియు సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:ఈ రోజు జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో జరిగిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) 59వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో కేంద్ర హోమ్ మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీఎస్ఎఫ్ వార్షిక పత్రిక 'బోర్డర్‌మ్యాన్'ని కూడా శ్రీ అమిత్ షా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీ అమిత్ షా తన ప్రసంగంలో "జీవన్ పరయంత్ కర్తవ్య" అనేది బీఎస్ఎఫ్ నినాదం మాత్రమే కాదని ఇప్పటి వరకు 1,900 మందికి పైగా సీమ ప్రహరీలు తమ జీవితాలను అత్యున్నత త్యాగం చేసి ఈ వాక్యాన్ని నెరవేర్చారని అన్నారు. లక్షలాది మంది సీమ ప్రహరీలు క్లిష్టపరిస్థితుల్లో కుటుంబాలకు దూరంగా ఉంటూ తమ జీవితాలను గడిపారని అన్నారు. దేశ సరిహద్దుల రక్షణలో మొదటి శ్రేణిగా దేశంలోని దుర్గమమైన సరిహద్దులను బీఎస్ఎఫ్ భద్రపరిచిన తీరు, సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఈ వీర సైనికులను చూసి దేశం మొత్తం గర్వపడుతుంది"అని ఆయన అన్నారు.

మాజీ ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఒకే సరిహద్దులో ఒక భద్రతా దళాన్ని మోహరించే ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నారని కేంద్ర హోమ్ మరియు సహకార మంత్రి తెలిపారు. ఈ నిర్ణయం ప్రకారం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల అత్యంత దుర్గమమైన సరిహద్దులను రక్షించే బాధ్యతను సరిహద్దు భద్రతా దళానికి అప్పగించామని బీఎస్ఎఫ్ ఈ బాధ్యతను చక్కగా నిర్వర్తించిందని చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌లోని మంచు ప్రాంతాలు, ఈశాన్య పర్వతాలు, గుజరాత్, రాజస్థాన్ ఎడారులు, గుజరాత్‌లోని చిత్తడి నేలలు లేదా సుందర్‌బన్స్ మరియు జార్ఖండ్‌లోని దట్టమైన అడవులు కావచ్చు బీఎస్ఎఫ్ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటోందని అన్నారు. సరిహద్దు భద్రతా దళం ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక మిషన్లలో కూడా అంతర్జాతీయ స్థాయిలో సేవా మరియు ధైర్యసాహసాలకు కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. సరిహద్దులు సురక్షితంగా లేని దేశం ఎప్పటికీ అభివృద్ధి చెందదు అని శ్రీ షా అన్నారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాలలో పురోగతి సాధించిందని, మన వీర సైనికుల త్యాగం, అంకితభావం మరియు ధైర్యసాహసాలతో మన సరిహద్దులను రక్షించుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుందని శ్రీ అమిత్ షా అన్నారు. దేశ సరిహద్దులను కాపాడే వీర సైనికులే దేశాభివృద్ధికి పునాది అని అన్నారు. బీఎస్ఎఫ్ సైనికులు సరిహద్దులను రక్షించడమే కాకుండా దేశంలోని యువతకు క్రమశిక్షణ సందేశాన్ని ఇస్తున్నారని శ్రీ షా అన్నారు. ఈరోజు మొత్తం 23 మంది జవాన్లకు శౌర్య పతకాలు, 5 మంది సైనికులకు మరణానంతరం పతకాలు అందజేసినట్లు తెలిపారు. ఈ 23 మంది సైనికుల్లో 11 మందికి శౌర్య పతకం, 1 జవానుకు జీవన్ రక్షా పదక్, 11 మంది సైనికులకు విశిష్ట సేవలందించినందుకు రాష్ట్రపతి పోలీసు పతకం లభించాయి. మరణానంతరం పతకాలు అందుకున్న ఐదుగురు అమరవీరుల కుటుంబాలకు వారి నష్టాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, అయితే ఈ అమరవీరుల త్యాగానికి దేశంలోని 130 కోట్ల మంది ప్రజలు ఎప్పుడూ గర్వపడతారని శ్రీ షా అన్నారు. 1 మహావీర చక్ర, 4 కీర్తి చక్ర, 13 వీర్ చక్ర, 13 శౌర్య చక్ర సహా అనేక పతకాలు అవార్డులు బీఎస్ఎఫ్‌కు లభించాయని తెలిపారు.

సరిహద్దు భద్రతకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యత ఇస్తారని కేంద్ర హోం మంత్రి అన్నారు. శ్రీ మోదీ నాయకత్వంలో గత 10 సంవత్సరాలలో సరిహద్దుల భద్రతను పటిష్టం చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం భద్రత, అభివృద్ధి మరియు ప్రజాస్వామ్య ప్రక్రియకు ప్రాధాన్యతనిస్తోందని శ్రీ షా అన్నారు. మోదీ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలతో సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమైన మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టిందన్నారు. సరిహద్దు గ్రామాల్లో అనేక సంక్షేమ పథకాలతో సరిహద్దు భద్రతా దళం మరియు అన్ని ఇతర దళాలను అనుసంధానించడం ద్వారా బలగాల ద్వారా భద్రతతో పాటు ప్రజా సంక్షేమం అనే కొత్త భావనను కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు. సరిహద్దు ప్రాంతాల్లో రైల్వేలు, రోడ్డు, వాటర్–వే కనెక్టివిటీ మరియు టెలికమ్యూనికేషన్ సౌకర్యాలను కూడా పెంచామని శ్రీ షా చెప్పారు. తద్వారా భూసరిహద్దుల వ్యాపారంతో పాటు ప్రజల మధ్య అనుసంధానం కూడా పెరిగిందన్నారు.

శ్రీ అమిత్ షా మాట్లాడుతూ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో సరిహద్దుల్లో దాదాపు 560 కిలోమీటర్ల ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా చొరబాట్లను మరియు అక్రమ రవాణాను అరికట్టడానికి 10 సంవత్సరాలుగా పని జరిగింది. వచ్చే రెండేళ్లలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఫెన్సింగ్‌తో భద్రత కల్పించాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. సరిహద్దులోని 1100 కిలోమీటర్లలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశామని, 542 కొత్త సరిహద్దు అవుట్‌పోస్టులు, 510 అబ్జర్వేషన్ పోస్ట్ టవర్లు నిర్మించామని హరామి నాలా ప్రాంతంలో మొదటిసారిగా అబ్జర్వేషన్ టవర్లను నిర్మించామని శ్రీ షా చెప్పారు. 637 అవుట్‌పోస్టుల వద్ద విద్యుత్, దాదాపు 500 చోట్ల నీటి కనెక్షన్లు కూడా అందించారు. అంతే కాకుండా 472 చోట్ల సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయడం ద్వారా సరిహద్దులో కాపలా కాసే సైనికుల సౌకర్యాన్ని నిర్ధారించారని తెలిపారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల సమన్వయ సరిహద్దు నిర్వాహణ విధానం సీమ ప్రహరీల పనిభారాన్ని బాగా తగ్గించిందని కేంద్ర హోం మంత్రి అన్నారు. గత ఐదేళ్లలో 30,000 కిలోల మత్తుపదార్థాలను బీఎస్ఎఫ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాలు దేశ భవిష్యత్తు తరాన్ని బోలుగా మార్చడమే కాకుండా దాని నుండి వచ్చే డబ్బు ఉగ్రవాదానికి ఆర్థిక సహాయం చేస్తుందని సరిహద్దులోని ఈ వాణిజ్య లింక్ ఆయుధాల అక్రమ రవాణాకు కూడా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ మూడు కారణాల వల్ల మొత్తం అంతర్జాతీయ సరిహద్దు వెంబడి మాదక ద్రవ్యాల వ్యాపారం పట్ల కఠినమైన, శూన్య సహనం మరియు సున్నితమైన విధానాన్ని కలిగి ఉండటం చాలా ముఖ్యమైనదని మరియు బీఎన్ఎఫ్ ఈ పనిని సమర్థవంతంగా అమలు చేసిందని శ్రీ షా అన్నారు.

సరిహద్దు భద్రతా దళం 2500 కంటే ఎక్కువ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నదని మరియు యాంటీ–డ్రోన్ టెక్నాలజీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతతో ఇది చాలా మంచి ప్రయోగాలు చేసిందని శ్రీ అమిత్ షా అన్నారు. బిఎస్ఎఫ్ ఇప్పటివరకు 90కి పైగా విదేశీ డ్రోన్‌లను కూల్చివేసిందని, విదేశీ డ్రోన్‌ల మార్గాలను గుర్తించడానికి న్యూఢిల్లీలో బిఎస్ఎఫ్ డ్రోన్ మరియు సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఆర్ అండ్ డి రంగంలో కూడా చాలా మంచి పని చేస్తోందని ఆయన అన్నారు. ఈ ప్రాంత ఆధిపత్యం కోసం కేంద్ర ప్రభుత్వం 100 డ్రోన్‌లతో పాటు ఫీల్డ్ ఫార్మేషన్‌లను అందించిందని, వీటిని బిఎస్ఎఫ్ సైనికులు బాగా ఉపయోగిస్తున్నారని ఆయన తెలిపారు. 5 సంవత్సరాలలో 5 కోట్ల మొక్కలు నాటాలని నినాదం ఇచ్చామని, మన కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సిఏపిఎఫ్) ఇప్పటి వరకు 5 కోట్ల మొక్కలు నాటించాయని, ఒక సైనికుడితో సహవాసం చేసి చెట్టును తమ సొంత బిడ్డల్లాగా పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీ షా తెలిపారు. ఈ 5 కోట్ల మొక్కలలో 92 లక్షల మొక్కలు సరిహద్దు భద్రతా దళానికి చెందిన సీమ ప్రహరీల ద్వారా నాటినట్లు శ్రీ షా తెలిపారు. ఈ మొక్కలు భవిష్యత్తులో పెద్ద వృక్షాలుగా మారి వాటిని నాటిన సైనికుల స్మృతి చిహ్నాన్ని సంతరించుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశం వామపక్ష తీవ్రవాదం నుంచి పూర్తిగా విముక్తి పొందే రోజు ఎంతో దూరంలో లేదని గత 10 ఏళ్లలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ దిశగా నిరంతరం కృషి చేసిందని కేంద్ర హోం మంత్రి అన్నారు. మోదీ ప్రభుత్వ కృషి ఫలితంగా హింసాత్మక సంఘటనలు 52 శాతం తగ్గాయని, మరణాల ఘటనలు 70 శాతం తగ్గాయని, వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలు 96 నుంచి 45కి తగ్గాయని శ్రీ షా అన్నారు. వింగ్ ఎక్స్‌ట్రీమిజం తగ్గిపోయిందని మరియు ఇప్పుడు సీఆర్‌పీఎఫ్ ,బీఎస్ఎఫ్ మరియు ఐటీబీపీ కొత్త ధైర్యం మరియు ఉత్సాహంతో దానికి తుది దెబ్బ వేయడానికి సిద్ధంగా ఉన్నాయి. రానున్న రోజుల్లో వామపక్ష తీవ్రవాదం నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాంతాల్లో భద్రతా శూన్యతను పూరించడానికి 2019 నుండి 199 కొత్త క్యాంపులను ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. కొత్త క్యాంపులను ఏర్పాటు చేసి పెట్రోలింగ్‌ను పెంచడం ద్వారా వామపక్ష తీవ్రవాదుల వనరులన్నీ నియంత్రించబడ్డాయని దీని ఫలితంగా బుధా పహాడ్ మరియు చకరబండ వంటి క్లిష్టమైన ప్రాంతాలను వామపక్ష తీవ్రవాదం నుండి పూర్తిగా విముక్తి చేయడంలో తాము విజయం సాధించామని శ్రీ షాచెప్పారు. కొల్హాన్ మరియు జార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాలలో లెఫ్ట్ వింగ్ తీవ్రవాదంపై తుది పోరు ఇంకా కొనసాగుతోందని ఈ పోరులో కచ్చితంగా విజయం సాధిస్తామని ఆయన అన్నారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా 40 లక్షలకు పైగా ఆయుష్మాన్ సీఏపిఎఫ్ కార్డులు పంపిణీ చేశామని శ్రీ అమిత్ షా తెలిపారు. శ్రీ నరేంద్ర మోదీ దాదాపు 13,000 మంది సైనికులకు ఇళ్లను కూడా అందించారని 113 కొత్త బ్యారక్‌లు నిర్మించారని త్వరలో మరో 11,000 ఇళ్లు సైనికులకు ఇస్తామని, 108 బ్యారక్‌లను కూడా నిర్మిస్తామని చెప్పారు. గత ఐదేళ్లలో 24,000 మందికి పైగా సైనికులకు ఇళ్లు అందించే పనులను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేస్తామన్నారు. ఇది కాకుండా సీఏపిఎఫ్ ఇ–హౌసింగ్ పోర్టల్ ద్వారా 70,000 మందికి పైగా సైనికులకు గృహాలు కేటాయించబడ్డాయి. కేంద్రంలోని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఎయిర్ కొరియర్ సేవలు, ఎక్స్‌గ్రేషియాలో సమానత్వం తీసుకురావడం మరియు సెంట్రల్ ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని పెంచడం వంటి అనేక పనులను చేసిందని ఆయన అన్నారు. శ్రీ నరేంద్ర మోదీ 10 సంవత్సరాల పాలనలో, జమ్మూ కాశ్మీర్, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలు మరియు ఈశాన్య మూడు హాట్‌స్పాట్‌లలో యుద్ధంలో విజయం సాధించామని శ్రీ షా అన్నారు. నేడు కశ్మీంలో ఉగ్రవాదంపై భద్రతా బలగాలదే పూర్తి ఆధిపత్యమని అన్నారు.

ఈశాన్య ప్రాంతంలో హింసాకాండ పరిస్థితి కూడా చాలా మెరుగుపడిందని లెఫ్ట్ వింగ్ తీవ్రవాదానికి వ్యతిరేకంగా జరిగి

కౌంటింగ్ సెంటర్ వద్ద జిల్లా ,కేంద్ర పోలీస్ బలగాలతో పటిష్ట పహారా

-కౌంటింగ్ సెంటర్ వద్ద, జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు

-జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): ఈనెల 3 తేదీ ఆదివారం జరగబోయే అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పోలీస్ పరంగా ఎలాంటి సంఘటనవు జరగకుండా కేంద్ర బలగాలు, ఆర్మ్డ్ రిజర్వ్ బలగాలు, స్థానిక పోలీస్ బలగాలతో మూడేంచేలా విధానంలో పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టడం జరిగిందని, కౌంటింగ్ సెంటర్ వద్ద, జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. తంగళ్ళ పల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గలకు సంబంధించి ఓట్ల లెక్కింపు చేపట్టనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి భద్రత పరంగం తీసుకోవలసిన పలు చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూతంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈనెల 3 వ తేదీ ఆదివారం రోజున అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున గ్రామాలలో పట్టణాలలో , మండలాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా నిష్పక్షపాతంగా అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సజావుగా నిర్వహించేందుకు గాను ఈనెల 3 తేదీ ఆదివారంఉదయం 6:00 నుండి 4 తేదీ సోమవారం

ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ గారు తెలిపారు. కౌంటింగ్ సెంటర్ వద్ద, జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు కానీ అంతకంటే ఎక్కువమంది కానీ గుంపులు గుంపులుగా తిరగవద్దని, పార్టీ జెండాలు, పార్టీ కండువాలు, గుర్తులు, ఫ్లా కార్డ్స్ ధరించవద్దు ప్రదర్శించవద్దని,మైకులు, లౌడ్ స్పీకర్లు, ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులకు,అనుమతి లేదన్నారు. ఎన్నికల కౌంటింగ్ పక్రియ ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు పోలీస్ వారికి సహకరించలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని,ఎలక్షన్ కమిషన్ జారి చేయబడిన గుర్తింపు కార్డ్ లను కలిగి ఉండాలని, గుర్తింపు కార్డ్ లను కలిగి ఉన్నవారిని మాత్రమే కౌంటీగ్ కేంద్రలోకి అనుమతించాడాం జరుగుతున్నరు. ఎస్పీ వెంట డిఎస్పీ ఉదయ్ రెడ్డి,స్పెషల్ బ్రాంచ్ సి. ఐ అనిల్ కుమార్, ఎస్.ఐ వెంకటేశ్వర్లు, పృథ్విదర్ గౌడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఓడిస్తా

-యూట్యూబ్ స్టార్ శిరీష (బర్రెలక్క) నాకు స్ఫూర్తి: దాసరి కవిత

ధర్మవరం డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి నిరుద్యోగ యువత కోసం అంటూ స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో దిగిన యూట్యూబ్ స్టార్ శిరీష (బర్రెలక్క) ను ఇతరులు స్ఫూర్తిగా తీసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒక మహిళా యూట్యూబ్ స్టార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా అంటున్నారు. తెలంగాణలో బర్రెలక్క మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో తాను కూడా నిరుద్యోగ యువత కోసం పోటీ చేస్తానని చెబుతున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన దాసరి కవిత అలియాస్ జుమ్‌చక జుమ్‌చక స్టార్ ఏపీలో రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తానంటున్నారు. ముఖ్యంగా ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఓడిస్తానని జుమ్‌చక జుమ్‌చక స్టార్ సవాల్ చేస్తున్నారు. కవిత పది హామీలతో ఏకంగా మ్యానిఫెస్టో కూడా రిలీజ్ చేశారు. కవిత యూట్యూబ్ ఛానల్‌లో కంటెంట్ లేకపోయినా కామెడీగా ఉంటుందని వ్యూస్ బాగా వస్తుంటాయి.

హైదరాబాద్, డిసెంబర్ 2:శనివారం ఆర్టిసి క్రాస్ రోడ్ లోని లక్ష్మీ గణపతి దేవాలయంలో గౌరవనీయులు ముషీరాబాద్ ఎమ్మెల్యే శ్రీ ముఠా గోపాల్ గారు అఖండ మెజారిటీతో గెలుపు సాధించాలని గాంధీనగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఎస్టి ప్రేమ్ ప్రేమ్ పూజలు నిర్వహించిన దృశ్యం.

అఖిలపక్ష సమావేశంలో కీలక నిర్ణయాలు..

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పార్లమెంటు లైబ్రరీ భవన్‌లో అఖిలపక్ష సమావేశం జరిగింది. డిసెంబర్ 4వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దాదాపు 19 రోజుల పాటు ఈ పార్లమెంట్ సమావేశాలు కొనసాగనున్నాయి. కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష భేటీకి వివిధ రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లు హాజరయ్యారు. పొగమంచు కారణంగా విమానాల దారి మళ్లింపుతో వైసీపీ, బీఆర్ఎస్ నేతలు హాజరు కాలేకపోయారు. టీడీపీ నుంచి రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్ హాజరయ్యారు.

ఈ సమావేశాల్లో ఎన్నికల కమిషనర్ల నియామకం బిల్లు, ఐపీసీ, సీఆర్పీసీ చట్టాల స్థానంలో తెచ్చే మూడు నేర శిక్షాస్మృతి బిల్లులతో పాటు మరికొన్ని ముఖ్యమైన బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సభ సజావుగా సాగేలా, బిల్లుల ఆమోదానికి సహకారించాలని పార్టీల నేతలను ఈ సందర్భంగా ప్రభుత్వం కోరింది. కాగా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 4 నుంచి 22 వరకు కొనసాగనున్నాయి.

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సర్వం సన్నద్ధం

– ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 3 వ తేదీన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వేదికగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు.

ఈనెల 3న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అదే రోజు సాయంత్రానికి పూర్తి ఫలితాలు వెలువడనున్నాయి.

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఏర్పాట్లు పూర్తి

సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీనియోజకవర్గాలకు అదే పాఠశాలలో వేరు వేరు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గంలో 14+1 చొప్పున టేబుళ్లు ఏర్పాట్లు చేశారు. లెక్కింపులో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు లెక్కించనున్నారు.

పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం కు 3 టేబుల్ లను ఏర్పాటు చేసి ఒకే రౌండ్ లో లెక్కింపు పూర్తి చేస్తారు. సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం కు 4 టేబుల్ లను ఏర్పాటు చేసి ఒకే రౌండ్ లో లెక్కింపు పూర్తి చేస్తారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ హాలులో 14 టేబుల్ లను ఏర్పాటు చేయనున్నారు.

ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారు. సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 21 రౌండ్లు, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో 19 రౌండ్ల లో ఈవీఎంలలో నీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు.

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద భారీ భద్రత

తంగల్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద స్థానిక పోలీసులు, ఆర్మ్ డ్ రిజర్వ్, కేంద్ర బలగాలతో

స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల కమిషన్ అనుమతి ఉన్నవారికే స్ట్రాంగ్ రూమ్స్ లోకి అనుమతి ఇస్తున్నారు. స్ట్రాంగ్ రూంల వద్ద 24 × 7 పటిష్ట నిఘా , భద్రతను ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పి

లెక్కింపు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ లు శనివారం సాయంత్రం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టేందుకు సర్వ సన్నద్ధంగా ఉండాలన్నారు. ఎస్పి అఖిల్ మహాజన్ పోలీస్ అధికారులతో భద్రతా ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించారు.

ఆది శ్రీనివాస్ గెలుపును ఆకాంక్షిస్తూ అయ్యప్ప స్వాములకు అన్నదానం

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వేములవాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించాలని కోరుకుంటూ ఆయన అభిమానులు శనివారం మహా పాద యాత్ర చేస్తున్న అయ్యప్ప స్వాము లకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ పట్టణం నుండి శబరిమలై అయ్యప్ప స్వామి సన్నిదానానికి కాలినడకన మహాపాద యాత్ర చేస్తున్న స్వాములకు తమిళనాడు రాష్ట్రంలోని కమలాపూర్ గ్రామంలో వేములవాడ పట్టణానికి చెందిన ఆది శ్రీనివాస్ అభిమాని యామ బాబు (దుబాయ్) అయ్యప్ప స్వాములకు బిక్షను ఏర్పాటు చేశారు. ఉదయం అయ్యప్ప స్వామికి దీక్ష స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 3న ఆదివారం వెలువడే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఆది శ్రీనివాస్ వేములవాడ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించాలని మాలధారణ స్వాములు నిండు మనసుతో ఆశీర్వదించారు. వేములవాడ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత: కమాండెంట్ యస్.శ్రీనివాసరావు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని కమాండెంట్ ఎస్ శ్రీనివాస్ రావు అన్నారు. 17వ పోలీస్ బెటాలియన్ నందు నిర్వహించిన ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా బెటాలియన్ కమాండెంట్ శ్రీ యస్.శ్రీనివాసరావు తన వంతుగా మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తరువాత అధికారులు మరియు సిబ్బంది అందరూ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ యస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆక్సిజన్ స్థాయిలను పెంచడంలో మొక్కలు పాత్ర కీలకం అని, మొక్కలు మానవాళి మనుగడకు ఎంతో దోహదం చేస్తూయాని, చెట్లను రక్షిస్తే అవి మనకి,మన భావితరాలకు రక్షణ కల్పిస్తాయని మొక్కల యొక్క ప్రాముఖ్యతను వివరించారు. మొక్కలను సంరక్షించే బాధ్యత అందరూ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ లు శ్రీ ఎ.జయప్రకాష్ నారాయణ , యమ్.పార్థసారథి రెడ్డి ,అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు సాహితీవనం కథా పురస్కారం -2024

తెలుగు సాహితీవనం కథాపురస్కారం కొరకు కథలను ఆహ్వానిస్తున్నాము.

నలుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ. 2,116 చొప్పున నగదు బహుమతితో పురస్కార ప్రదానం ఉంటుంది. హైదరాబాద్ లో జరిగే తెలుగు సాహితీవనం వార్షికోత్సవ సభలో విజేతలకు పురస్కారం అందచేస్తాము

నిబంధనలు :

– వర్తమాన పరిస్థితులు, మానవ సంబంధాలు ... ఇలా ఏ సాంఘిక ఇతివృత్తం అయినా పర్వాలేదు. కథ 1200 పదాల కంటే మించరాదు

–కథను వర్డ్ లో యూనికోడ్ లో టైప్ చేసి టెక్స్ట్ రూపం లో పంపించాలి

–కథతో పాటు హామీ పత్రం తప్పకుండా జత చెయ్యాలి. ఏ ఇతర మధ్యమాలలోనూ ప్రచురించిన, పరిశీలనలో ఉన్న కథను పంపకూడదు

–కథలను బజీష్ఠతిబితిలజీనిజీఏ82ఏణఎజీతిశ్రీ.ఇనీఏ కు ఎజీతిశ్రీ చేయాలి

–కథలను పంపటానికి చివరి తేదీ : **30.12.2023.** మరిన్ని వివరాలకు –9490805404

నిర్వహణ : తెలుగు సాహితీవనం టీమ్

బి ఆర్ ఎస్ కార్పొరేటర్ తమ్ముడి దౌర్జన్యం.. బెదిరింపు చర్యలు...

-చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీనేతల డిమాండ్..

కరీంనగర్, డిసెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరపాలక సంస్థ 9వ డివిజన్ కార్పొరేటర్ తమ్ముడు 30మంది తో కలిసి స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలతో అకారణంగా గొడవపడి , దౌర్జన్యం చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఈస్ట్ జోన్ ప్రధాన కార్యదర్శి, 9వ డివిజన్ ఇన్చార్జి మాసం గణేష్ శనివారం కరీంనగర్లో మాట్లాడారు. కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్ తమ్ముడు మంత్రి గంగుల అండదండలతో రెచ్చిపోతున్నాడని, శుక్రవారం రాత్రి వేళలో బిజెపి శ్రేణులపై దాడి చేయాలనే లక్ష్యంతో ఏకంగా ఇండ్ల మీదికే వచ్చి దౌర్జన్యం చేశారన్నారు. ప్రశ్నిస్తే దాడులు చేసే సంస్కృతికి బిఆర్ఎస్ నాయకులు అలవాటు పడ్డారని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి పద్ధతి మంచిది కాదన్నారు. రాజకీయాలు ప్రజల కోసం ఉపయోగపడాలి కానీ , నేడు వ్యక్తుల లక్ష్యంగా జరుగుతున్నాయని, చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇష్టమొచ్చిన రీతిలో అనభ్య పదజాలంతో మాట్లాడుతున్నారనీ,ఇలాంటి వ్యక్తుల విషయంలో పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చంపుతామని బెదిరిస్తూ ,అరాచకాలు , దౌర్జన్యాలు చేస్తున్న వారిని డివిజన్లో కార్పొరేటర్ , మంత్రి పెంచి పోషిస్తున్నారని , ఇలాంటి చర్యలను 9వ డివిజన్ బిజెపి పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరాచకాలు ,దౌర్జన్యాలు, రౌడీయిజం చేస్తున్న కార్పొరేటర్ తమ్ముడి

విషయంలో బిజెపి డివిజన్ ప్రజలకు అండగా ఉంటుందని , పోలీసులు కార్పొరేటర్ తమ్ముడు పై చట్టరీత్యా తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఏపీని నాలెడ్జ్, స్కిల్స్ హబ్‌గా మార్చడమే లక్ష్యం

విశాఖపట్నం, డిసెంబర్ 2 : ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్ ను నాలెడ్జ్, స్కిల్స్ హబ్‌గా మార్చడమే లక్ష్యమని స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేష్ కుమార్ తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రత్యేకమైన కార్యక్రమాన్ని రూపొందించింది పేర్కొన్నారు. ఇరవై మిలియన్ల మంది నైపుణ్యం కలిగిన కార్మికులను తయారు చేయనున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కోఆపరేషన్ (ఏపీఎస్ఎస్డీసీ)తో అంతర్నిర్మిత భాగస్వామ్యంతో స్కిల్స్ క్యాస్కేడ్ ఎకోసిస్టమ్, రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన ఇన్‌స్టిట్యూట్‌లను పునరుద్ధరించడం, పునరుజ్జీవం పజేయడంపై దృష్టి పెట్టిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖపట్నంలో పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నారని తెలిపారు. వాటిలో 'ఏపీ స్కిల్స్ యూనివర్స్ అప్లికేషన్' ఒకటన్నారు.

స్కిల్స్ క్యాస్కేడ్ ఎకోసిస్టమ్ విద్యార్థులకు ఉపాధిని అందించే లక్ష్యంతో మార్కెట్ సంబంధిత పాఠ్యాంశాలను సెట్ చేయడం ద్వారా పారిశ్రామిక డిమాండ్‌కు సాంకేతిక, వృత్తి విద్యా పర్యావరణ వ్యవస్థను సమలేఖనం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలు (ఐటీఐలు), పాలిటెక్నిక్ కళాశాలలు, నైపుణ్య కళాశాలలను పరిశ్రమ కమ్ శిక్షణా కేంద్రాలుగా ఆధునీకరించడానికి, రీబ్రాండ్ చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 88 కోట్ల పెట్టుబడిని ప్రధాన కార్యక్రమాలలో ప్రకటించిందన్నారు. 13 జిల్లాల్లో సరికొత్త 13 స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను నిర్మించేందుకు 9.1 కోట్ల పెట్టుబడి పెట్టారన్నారు. స్కిల్స్ క్యాస్కేడ్ ఎకోసిస్టమ్ అమలుకు ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నాయకత్వం వహిస్తుందన్నారు. ఈ పర్యావరణ వ్యవస్థలో స్కిల్స్ హబ్‌లు (శాసనసభ నియోజకవర్గాలలో), నైపుణ్య కళాశాలలు (పార్లమెంటరీ నియోజకవర్గం), నైపుణ్యాల విశ్వవిద్యాలయం (రాష్ట్ర స్థాయి సంస్థలు), స్కిల్ స్పోక్స్ (పరిశ్రమలతో సహకారం), స్కిల్స్ ఇంటర్నేషనల్ (అంతర్జాతీయంగా బెంచ్‌మార్క్ చేయబడిన నాణ్యమైన కార్యక్రమాలను రూపొందించడానికి) ఉంటాయన్నారు. రాష్ట్రంలో 26 నైపుణ్య కళాశాలలు, 192 హబ్‌లతో యువతకు నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడానికి 55 పరిశ్రమలు ఇప్పటికే 'స్కిల్ స్పోక్స్'గా ఏపీఎస్ఎస్డీసీతో చేతులు కలిపాయని తెలిపారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.